

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 18 అక్టోబర్ 2024 | వెల : 4/-




## హర్యానా సీఎంగా నాయబ్ సింగ్ సైనీ

- ముచ్చటగా మూడోసారి కొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పిన బీజేపీ
- హరియాణా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాయబ్ సింగ్ సైనీ
- నాయబ్ సింగ్ సైనీతోపాటు మరో 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు.
- ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం

# 23న కేబినెట్

- ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది.
- పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం
- హైడ్రాకు చట్టబద్ధత, రైతు భరోసా, రుణమాఫీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలు చర్చకు రానున్నాయి
- ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులతో పాటు కుల గణన వంటి అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం



హైదరాబాద్

తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈనెల 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ భేటీలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధత, రైతు భరోసా, రుణమాఫీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ వంటి అంశాలు చర్చకు రానున్నాయిఈనెల 23వ తేదీన తెలంగాణ మంత్రివర్గం సమావేశం కానుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన - మిగతా3లో



## పెరగనున్న మద్యం ధరలు

- సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది.
- ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా భారీగా ఉదాయం వచ్చింది
- ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి
- రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి



## కొత్త సీజేఐగా సంజీవ్ ఖన్నా?

- జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రెండు దశాబ్దాల జుడిషియల్ అనుభవం
- మరో నెల రోజుల్లో కొత్త చీఫ్ జస్టిస్ రాబోతున్నారు.
- నవంబర్ 10, 2024న ముగియనున్న ప్రస్తుత సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం
- తదుపరి సీజేఐగా సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సంజీవ ఖన్నా పేరుని కేంద్రానికి సూచించిన డివై చంద్రచూడ్

## మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాదు..

# మూసీ ప్రక్షాళన

- మూసీ ప్రాజెక్టులో నాకేం ప్రయోజనం లేదు
- నేనేం అందాల భామల కోసం పని చేయడం లేదు
- మూసీ ప్రాజెక్టు వల్ల తనకేమీ ఆర్థిక ప్రయోజనం లేదన్న రేవంత్ రెడ్డి
- మూసీ ప్రాజెక్టు అగ్రిమెంట్ విలువ రూ.141 కోట్లు అని స్పష్టీకరణ
- మూసీ ప్రాజెక్టుపై విషం ఎందుకు చిమ్ముతున్నారు
- విద్యావంతుల నుంచి నిరక్షరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలి
- గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారు
- గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చింది
- 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారు



హైదరాబాద్

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై తెలంగాణ ముఖ్య మంత్రి కీలక కామెంట్స్ చేశారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశం పై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహ కంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివా హకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నా మన్నారు. మూసీ ప్రాజెక్టు వల్ల తనకేమీ ఆర్థిక ప్రయోజనం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా3లో

## గ్రూప్-1 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులకు సీఎస్ ఆదేశం
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారు
- హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు
- అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు

హైదరాబాద్

ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యం త పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ - మిగతా3లో



## ప్రశ్నించడం బంద్ అయితే..

# తెలంగాణ మూగబోతది



- కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు
- తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు
- బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే
- మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు.
- బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక : కేటీఆర్
- కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి

హైదరాబాద్

రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అ యితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలం గాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మం డిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎ స్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో - మిగతా3లో



## ఈ రాష్ట్రాల్లో త్వరలో గవర్నర్ల బదిలీలు

- అక్టోబర్, నవంబర్ నెలల్లో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లను బదిలీ చేసే అవకాశం
- మూడు నుంచి ఐదు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న రాష్ట్రాల గవర్నర్‌లను బదిలీలు చేయాలని నిర్ణయం
- ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ, జమ్మూ కాశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలల్లో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు మారే అవకాశం

## మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధం కావాలి

- మందకృష్ణ మాదిగ పిలుపు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయింది
- తేనే పూసిన కత్తిలా ఆయన మాటలు ఉంటాయి
- ప్రజలను నమ్మించడంలో ఘనుడే.. మోసం చేయడంలో అంతకంటే ఘనుడు.



హైదరాబాద్

మాదిగలను నమ్మించి నమ్మక ద్రోహానికి పాల్పడ్డ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాల్సింది మాదిగ, ఉపకులాలకు పిలుపునిస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సోమా జిగూడ ప్రెస్ క్లబ్‌లో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఏడాది ఆగస్టు 1వ తేదీన నిండు శాసనసభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తొలుత దేశంలో తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తదని హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుం దన్నారు. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ రిజర్వే షన్ల అమల్లో పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ముందు వసరులో ఉన్నాయని మందకృష్ణ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ - మిగతా3లో

# ఈ రాష్ట్రాల్లో త్వరలో గవర్నర్ల బదిలీలు

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం అక్టోబర్, నవంబర్ నెలల్లో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లను బదిలీ చేసే అవకాశం ఉంది. అనేక రాష్ట్రాల్లో గవర్నర్‌లు, లెఫ్టినెంట్ గవర్నర్‌లు ఇప్పటికే మూడు నుంచి ఐదు సంవత్సరాలకు పైగా పనిచేసినందునా బదిలీల ప్రక్రియ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళ, జమ్మూ కాశ్మీర్, కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూలలో గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు మారనున్నారు. జమ్మూ కశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నాలుగేళ్లకు పైగా పదవిలో ఉన్నారు. సిన్హా స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలున్న, అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించిన బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌ను భర్తీ చేసే అవకాశం ఉందని ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఐదు ఏళ్లకుపైగా కేరళ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు వేరే పదవి ఇచ్చే అవకాశం ఉంది. అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్ దేవేంద్ర కుమార్ జోషి పదవీ విరమణ చేయవచ్చు. లేదంటే కేరళ, జమ్మూ కశ్మీర్‌లకుగానూ ఆయనకు నూతన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

**త్వరలోనే..**

కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌లు మూడేళ్లకు పైగా తమ పదవుల్లో కొనసాగుతున్నారు. జులై 15, 2021న బాధ్యతలు



స్వీకరించిన గోవా గవర్నర్ %ూా% శ్రీధరన్ పిళ్లై, జూలై 15, 2021 నుండి పదవిలో ఉన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా మూడేళ్లకు పైగా పదవీకాలం పూర్తి చేసుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ సి పటేల్ ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్ సింగ్‌కు సంబంధించి 3 ఏళ్ల పదవీ కాలం పూర్తయింది. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఐదేళ్లు... తమిళనాడు ఆర్‌ఎన్ రవి, గోవా పీఎస్ శ్రీధరన్ పిళ్లై మూడేళ్లుగా గవర్నర్ పదవిలో ఉన్నారు. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత పునర్వ్యవస్థీకరణ జరగవచ్చని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయని సీనియర్ బీజేపీ నేతలను గవర్నర్ లేదా ఎల్‌జీలుగా నియమించే అవకాశం ఉంది. మాజీ ఎంపీలు అశ్వనీ చౌబే, వీకే సింగ్, ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ఈ జాబితాలో ఉన్నాయి.

# కొత్త సీజేఐగా సంజీవ్ ఖన్నా?

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మరో నెల రోజుల్లో కొత్త చీఫ్ జస్టిస్ రాబోతున్నారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సిజెఐ) డివై చంద్రచూడ్ సుప్రీం కోర్టు సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సంజీవ ఖన్నా పేరుని కేంద్రానికి సూచించారు. గత శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ కు లేఖ రాసింది. ఆ లేఖలో ఆయన తదుపరి చీఫ్ జస్టిస్ పేరుని ప్రస్తావించాలని.. మెమోరాండమ్ ప్రొసీజర్ ప్రకారం రెకమెండ్ చేయాలని అడిగింది. ప్రస్తుత సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10, 2024న ముగియనుంది. రెండేళ్ల క్రితం ఆయన డిసెంబర్ 17, 2022న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భారతదేశపు 50వ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన తరువాత సుప్రీం కోర్టులోని మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జస్టిస్ డివై చంద్రచూడ్ తండ్రి వైవి చంద్రచూడ్ భారతదేశపు సుప్రీం కోర్టు లో సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. ఆయన ఫిబ్రవరి 22, 1978 నుంచి జూలై 11, 1985 వరకు ఏడు సంవత్సరాలకు పైగా సిజెఐ పదవిలో ఉన్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నా నవంబర్ 10, 2024 నుంచి మే 13, 2025 వరకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా పదవి చేపట్టనున్నారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో



ప్రస్తుతం సిజెఐ చంద్రచూడ్ తరువాత ఆయనే సీనియర్ మోస్ట్ జడ్జి. జస్టిస్ సంజీవ్ ఖన్నా జనవరి 2019 నుంచి సుప్రీం కోర్టులో జడ్జిగా సేవలు అందిస్తున్నారు. సుప్రీం కోర్టులో ఆయన పనితీరు, తీసుకున్న నిర్ణయాలుతో ప్రశంసలందుకున్నారు. ఆయన జుడిషియల్ కెరీర్ లో ఒక వివాదం ఉంది. సుప్రీం కోర్టు జడ్జిగా ఆయన నియామకం చాలా వివాదాస్పదంగా జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సుప్రీం కోర్టు జడ్జిగా నియామక ప్రక్రియలో ఆయన కంటే 33 సీనియర్ జడ్జీలు ఉండగా.. వయసులో, అనుభవంలో చాలా చిన్నవాడైన సంజీవ్ ఖన్నాకు ఆ అవకాశం లభించింది. అయితే ఈ వివాదాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తన పనితీరుతో కొన్ని నెలల్లోనే అధిగమించారు.ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు.. ఎమర్జెన్సీకి నిరసనగా సుప్రీం కోర్టు జడ్జి అయిన జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా సోదరుడి కుమారుడే ఈ జస్టిస్ సంజీవ్ ఖన్నా. జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా తన పదవి కాలంలో సుప్రీం కోర్టులో అందించిన సేవలకు గుర్తింపు పొందారు.

**జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రెండు దశాబ్దాల జుడిషియల్ అనుభవం**

సుప్రీం కోర్టులో జడ్జిగా నియామకం పొందే ముందు జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టులో 14 సంవత్సరాలు సేవలందించారు. ట్యాక్సేషన్, కమర్షియల్ చట్టాలలో ఆయనకు మంచి పట్టు ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఈ రంగాలలో ఆయన పలు కీలక తీర్పులు వెలువరించారు. మే 14, 1960లో జన్మించిన సంజీవ్ ఖన్నా ఢిల్లీ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ పూర్తి చేసి.. 1983లో లాయర్ గా ప్రాక్టీస్ ప్రారంభించారు. ఢిల్లీ జిల్లా కోర్టుల్లో ఆయన తన కెరీర్ ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హై కోర్టు, ట్రిబనల్స్ లో వాదించేవారు. సంజీవ్ ఖన్నా ఎక్కువగా రాజ్యాంగ చట్టాలు, డైరెక్ట్ ట్యాక్స్, కంపెనీ లా, భూ చట్టాలు, పర్యవరణ చట్టాలు, బిజినెస్ కార్పొరేట్ తగాదాల్లో ఆర్బిట్రేషన్ లాంటి కేసులు ఆయన వాదించారు.

# హర్యానా సీఎంగా నాయబ్ సింగ్ సైనీ

**ఛండీఘడ్ :** ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ.. ఆ రాష్ట్రంలో మరోసారి అధికారాన్ని చేపట్టి.. చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు ఆ రాష్ట్ర చరిత్రలో ఏ పార్టీకి లేని విధంగా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి ముచ్చటగా మూడోసారి కొత్త ప్రభుత్వాన్ని నెలకొల్పింది. ఇక మరోసారి నాయబ్ సింగ్ సైనీ.. హర్యానా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నాయబ్ సింగ్ సైనీతోపాటు మరో 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీలు హాజరయ్యారు. వీరితోపాటు దేశంలోని 18 ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారు.చండీగఢ్ సమీపంలోని పంచకుల పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో 54 ఏళ్ల నాయబ్ సింగ్ సైనీతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక ప్రమాణ స్వీకారానికి ముందు వాల్మీకి ఆలయంలో నాయబ్ సింగ్ సైనీ పూజలు నిర్వహించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో హర్యానా అభివృద్ధిలో వేగంగా ముందుకువెళుతుందని సీఎం చెప్పారు. 1970లో పుట్టిన నాయబ్ సింగ్ సైనీ.. రాజకీయాల్లోకి వచ్చి 3 దశాబ్దాలు అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నేతృత్వంలో రాజకీయాల్లోకి వచ్చిన సైనీ.. 2014లో నారాయిన్‌గఢ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ



తర్వాత 2016లో మంత్రి పదవి దక్కించుకున్నారు. అప్పటి నుంచి తన రాజకీయ ప్రస్థానం ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ క్రమంలోనే 2019 లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిర్మల్ సింగ్‌ను భారీ తేడాతో ఓడించారు.ముఖ్యమంత్రితోపాటు మరో 13 మంది ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కాయి. కులసమీకరణాలు అన్నీ పక్కాగా చూసుకుని బీజేపీ మంత్రి పదవుల కేటాయింపు చేసింది. ఇందులో దళితులు, బ్రాహ్మణులు, జాట్ వర్గాల నుంచి ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు వచ్చాయి. ఓబీసీ నుంచి నలుగురికి కేబినెట్‌లో చోటు దక్కగా.. రాజ్‌పుత్, పంజాబీ, బనియా వర్గాల నుంచి ఒక్కొక్కరినీ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కేంద్రమంత్రి రావ్ ఇంద్రజీత్ కుమార్తె ఆర్తీ రావు కూడా సైనీ కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణం చేశారు.ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పటాపంచలు చేస్తూ.. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని విజయాన్ని దక్కించుకుంది. 90 మంది సభ్యులు ఉన్న హర్యానా అసెంబ్లీలో బీజేపీ నుంచి 48 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చిన నాయబ్ సింగ్ సైనీనే మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు అధిష్ఠానంతోపాటు స్థానిక నాయకత్వం మొగ్గు చూపడంతో సీఎం కుర్చీ సైనీకే దక్కింది. బుధవారం జరిగిన బీజేపీ శాసనసభా పక్ష భేటీలో సైనీని ఎన్నుకున్నారు.

**జమ్మూలో ఒమర్ అబ్దుల్లా..**

హరియాణాతోపాటు ఎన్నికలు జరిగిన జమ్మూకశ్మీర్‌లో బుధవారం నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం కొలువుతీరింది. శ్రీనగర్‌లోని షెరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొత్త సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా జమ్మూకు చెందిన సురిందర్ చౌధరి, మరో నలుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితరులు హాజరయ్యారు.

# బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా అరెస్ట్‌కు వారెంట్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రైబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణ హోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రైబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది



ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

## పౌరసత్వ చట్టంలోని సెక్షన్-ఎ రాజ్యాంగబద్ధమే..

**సమర్థించిన సుప్రీంకోర్టు..**



పౌరసత్వ చట్టం 1955లోని సెక్షన్‌ఏ రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోమిశ్రా ధర్మాసనం 4:1 మెజారిటీతో రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. అయితే, న్యాయమూర్తుల్లో జస్టిస్ పార్దివాలా మాత్రమే రాజ్యాంగ విరుద్ధమంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశీయులను భారత పౌరులుగా గుర్తించినా.. పదేళ్ల వరకు ఓటేసే హక్కు ఉండదన్నారు. బంగ్లాదేశ్ (గతంలో తూర్పు పాకిస్థాన్) నుంచి శరణార్థుల రాక అసోం జనాభా సమతౌల్యతను తీవ్రంగా ప్రభావితం చేసిదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6ఎ రాష్ట్రంలోని అసలైన నివాసితుల రాజకీయ, సాంస్కృతిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషన్లు ఆరోపించారు. విచారణ సందర్భంగా సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ అక్రమ వలసలకు అసోం అకార్డ్ రాజకీయ పరిష్కారమని.. సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిబంధనలు రూపొందించేందుకు మెజార్టీతో కూడిన పార్లమెంట్‌కు ఆ శక్తి ఉందన్నారు.

మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతౌల్యత సెక్షన్‌కు ఉందని.. ఇందులో కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదేనన్నారు. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసిందని. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని చెబుతోందని.. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదని.. మరీ తక్కువగాను విలీనం చేసుకోలేదని సీజేఐ వ్యాఖ్యానించారు. పౌరసత్వ చట్టం 1955 సెక్షన్6ఎ మేరకు 1966 జనవరి నుంచి 1971 మార్చి 25లోపు అసోంకు వచ్చిన వలసదారులు పౌరసత్వం కోరవచ్చు. ఈ రూల్‌ని 1985లో అసోం అకార్డ్ తర్వాత తీసుకువచ్చారు. అసోంలోకి బంగ్లాదేశ్ వలసలపై ఉద్యమించినవారితో కేంద్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ఇది. దీని చట్టబద్ధతపై అసోంలోని కొన్ని స్థానిక గ్రూపులు సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. రాజ్యాంగ పీఠికకు విరుద్ధమని, పౌరహక్కుల ఉల్లంఘనతో పాటు రాజకీయ హక్కులను హరించడమేనని ఆయా గ్రూపులు వాదించాయి.

## 1,200 కోట్ల కుంభకోణం దర్యాప్తులో ఫోర్జరీ..

**ఐపీఎస్ అధికారిణిపై సీబీఐ కేసు**

**ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఐపీఎస్ అధికారిణిపై ఆరోపణలు**

**ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ పేరుతో వందలాది వ్యక్తులను ఆ సంస్థ మోసం చేసినట్లు ఆరోపణలు**



**ముంబై:** భారీ కుంభకోణం కేసు దర్యాప్తులో ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఐపీఎస్ అధికారిణిపై ఆరోపణలు వచ్చాయి. సీఐడీ దర్యాప్తులో ఇది బయటపడింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఆమెపై కేసు నమోదు చేసింది. మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఉన్న భైచంద్ హీరాచంద్ రైసోని క్రెడిట్ సొసైటీలో రూ.1,200 కోట్ల కుంభకోణం వెలుగుచూసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ పేరుతో వందలాది వ్యక్తులను ఆ సంస్థ మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా, 2020 నుంచి 2022 వరకు ఆర్థిక నేర విభాగం డీసీపీగా ఉన్న ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టేక్ ఈ స్కామ్‌పై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు నేతృత్వం వహించారు. అయితే ఒకే రోజు ఒకే నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం, ఫిర్యాదుదారులు హాజరుకాకుండానే వారి సంతకాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు పత్రాలు సృష్టించడంలో ఆమె ప్రమేయం ఉన్నట్లు సీఐడీ విచారణలో వెల్లడైంది. దీంతో సీఐడీ నివేదిక ఆధారంగా ఈ వ్యవహారంపై కేసు నమోదు చేయాలని పూణె పోలీసులను మహారాష్ట్ర హోంశాఖ ఆదేశించింది.

మరోవైపు 2020లో ఈ కుంభకోణం కేసును సీబీఐకి బదిలీ చేశారు. దీంతో 12 బ్యాంకులను మోసం చేసినందుకు ఢిల్లీకి చెందిన కంపెనీ డైరెక్టర్లపై అవినీతి, చీటింగ్ కేసు నమోదైంది. అలాగే ఈ స్కామ్‌పై దర్యాప్తులో ఫోర్జరీ, తప్పుడు పత్రాలు సృష్టించడం వంటి నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆరోపణలున్న ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టేక్‌పై కేసు నమోదు చేసినట్లు సీబీఐ గురువారం ప్రకటించింది. భారత శిక్షాస్మృతిలోని 120–బీ, 466, 474, 201 సెక్షన్లకు సంబంధించి ఆమెపై అభియోగాలు మోపినట్లు పేర్కొంది.

## మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందా




**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీతోపాటు, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ విస్తరణ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న అన్ని రాష్ట్రాల్లో బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇటీవల జమ్మూ కశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆప్, హరియాణాలో ఖాతా తెరవలేకపోయింది. జమ్మూ కశ్మీర్‌లో ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. అయితే రానున్న కొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార?ండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆప్ ఈ రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేస్తుందా?

**'ఇండియా'కే మద్దతు..**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జార?ండ్, మహరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసే అవకాశం లేదు. రాజకీయ శూన్యత లేని రాష్ట్రాల్లో రెండు, మూడు సీట్ల కోసం ఇతర పార్టీలతో చర్చలు జరపడం వ్యర్థమని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు. మహారాష్ట్రలో ఆప్ క్యాడర్ విస్తరించాలని అనుకుంటోంది. అయితే ఇందుకు కేజ్రీవాల్ సహా పార్టీ అధిష్టానం ఆసక్తి చూపట్లేదు. బదులుగా మహారాష్ట్రలో ఇండియా కూటమి పార్టీలకు మద్దతు తెలపాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖిగా సాగే ఎన్నికల్లో ఆప్ బరిలో నిలిస్తే.. కాంగ్రెస్సే ఎక్కువగా నష్టపోతోంది. పలు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైంది. దీంతో మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో నేరుగా పోటీ చేసే బదులు ఇండియా కూటమికి మద్దతు పలకాలని ఆప్ భావిస్తోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశం ఉన్నందున ఓటర్లలో గందరగోళం సృష్టించకూడదనే ఉద్దేశంతో మహారాష్ట్రలో పోటీకి దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో పరిస్థితిని అంచనా వేశాకే తాము ఈ నిర్ణయానికి వచ్చామని సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఈ ఏడాది మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే దశలో, జార?ండ్‌లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. జార్ఖండ్‌లో మొదటి దశ పోలింగ్ నవంబర్ 13న, రెండో దశ నవంబర్ 20న జరగనుంది. రెండు రాష్ట్రాల ఫలితాలు నవంబర్ 23న వెల్లడికానున్నాయి.

**2019లో...**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 2019లో కూడా మహారాష్ట్ర, జార?ండ్‌లలో పోటీ చేసింది. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాల్లో 24 స్థానాల్లో బరిలో నిలవగా 23 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. జార్ఖండ్‌లోని 81 స్థానాలకు గానూ ఆ పార్టీ 26 స్థానాల్లో పోటీ చేయగా అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో 90 స్థానాలకుగానూ 89 చోట్ల పోటీ చేసిన ఆప్ కేవలం 1.53 ఓట్ల శాతం మాత్రమే సాధించి డిపాజిట్లు పోగొట్టుకుంది. ఇక్కడ బీజేపీ 48 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 35 స్థానాల్లో విజయం సాధించింది.

# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాదు.. మూసీ ప్రక్షాళన

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. తానేమీ అందాల మేడలు... అందాల భామల కోసం పని చేయలేదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూసీ ప్రాజెక్టు వల్ల తనకు ఏమైనా ఆర్థిక ప్రయోజనం ఉందా? అని ప్రశ్నించారు. ఆదాయాన్ని పెంచాలి... పేదలకు పంచాలనేదే తమ విధానం అన్నారు.

ఇందులో తనకు స్వార్థం లేదన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాదని... ప్రక్షాళన అన్నారు. ఈ ప్రాజెక్టు వద్దంటే చెప్పాలని... వదిలేద్దామన్నారు. మూసీ విషం హైదరాబాద్ నగరాన్నే కాదు... నల్గొండనూ మింగుతోందన్నారు. నల్గొండ ప్రజలు ఈ అంశంపై మాట్లాడకుంటే ఎలా? అన్నారు. తనకేదో స్వార్థం ఉన్నట్లు తనను నిందిస్తున్నారని, కానీ తనను విమర్శించేది ఓ దోపిడీ దొంగ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లు తనను తిడితే బాధపడనన్నారు.

విద్యావంతుల నుంచి నిరక్షరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు సీఎం. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని



సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారాయన. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనల తోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

**మూసీ ప్రాజెక్టు అగ్రిమెంట్ విలువ రూ.141 కోట్లు**

మూసీ ప్రాజెక్టు లక్షన్నర కోట్ల ప్రాజెక్టు అని ఆరోపణలు చేస్తున్నారని... కానీ ఇది కేవలం రూ.141 కోట్ల అగ్రిమెంట్ అని స్పష్టం చేశారు. లక్షన్నర కోట్లు అని చెప్పి మింగేయడానికి ఇదేమైనా కాళేశ్వరం ప్రాజెక్టా? అని ప్రశ్నించారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో ఉంటున్న వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామన్నారు.

**మూసీ ప్రాజెక్టుపై విషం ఎందుకు చిమ్ముతున్నారు?**

గుజరాత్‌లోని సర్దార్ పటేల్ విగ్రహం, హైదరాబాద్ సమతామూర్తి ప్రాజెక్టును చేపట్టింది మెయిన్‌హార్డ్స్ సంస్థనే అని తెలిపారు. అదే సంస్థ మూసీ ప్రాజెక్టు చేపడితే ఎందుకు తప్పు పడుతున్నారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుపై విషం చిమ్మడం ఏమిటని మండిపడ్డారు. తాను కెప్టెన్ వంటి వాడినని... టీమ్ అంతా వద్దంటే తాను ఒక్కడిని ఎలా అడుతానని ప్రశ్నించారు. మీరంతా వద్దంటే తాను ఈ టెండర్ క్యాన్సిల్ చేయడానికి సిద్ధమని వెల్లడించారు.

**వర్షం వస్తే చెన్నై, బెంగళూరు నగరాలను చూశారా?**

మూసీ పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో నగరానికి ఇబ్బందులు వస్తాయన్నారు. వర్షం వస్తే చెన్నై, బెంగళూరు నగరాలు ఎలా అవుతున్నాయో ఇప్పటికే మనం చూశామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మం, విజయవాడ మునిగిన విషయం గుర్తించాలన్నారు. వయనాడ్ పరిస్థితిని అందరం చూశామన్నారు.

**జైలుకు పంపిస్తే తిండి వేస్ట్**

నాగోల్ సుందరీకరణ పేరుతో చేసిన దోపిడీ అంతా ఇంతా కాదన్నారు. ఈ అంశంలో వారిని జైలుకు కూడా పంపించవచ్చునని... కానీ జైల్లో తిండి కూడా వేస్ట్ అన్నారు. మూసీ ప్రాజెక్టుపై చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. అధికారం కోల్పోయాక ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని అడ్డుకోవాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని విమర్శించారు. అధికారం ముసుగులో దోచుకున్న బందిపోట్లు దొంగలు వీరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూట్యూబ్‌తో అధికారం వస్తుందని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి బందిపోటు దొంగలు మూసీని అడ్డుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల ఉచ్చులో ప్రజలు పడవద్దని కోరారు. నగరంలో బఫర్ జోన్‌లో పదివేల ఇళ్లు ఉన్నాయని, వారిని ఎలా ఆదుకోవాలనేదే తమ ఆలోచన అన్నారు. ఈ నగరాన్ని ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. మూసీ విషయంలో మనం చరిత్రహీనులుగా మిగిలి పోకూడదన్నారు. మూసీ ప్రక్షాళన కోసం మంచి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అందరి సహకారం ఉంటేనే మూసీ ప్రాజెక్టు విషయంలో ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు.

# ప్రశ్నించడం బంద్ అయితే.. తెలంగాణ మూగబోతది

-మొదటిపేజీ తరువాయి

అతిపెద్ద బిల్డింగ్ కట్టాను.. కానీ 8 ఏండ్లలో మున్సిపల్ మంత్రిగా ఉన్న మిమ్మల్ని కలిసే అవసరం రాలేదు. కానీ ఇప్పుడు మొదటిసారి కలుస్తున్నాను. అప్పుడు కేసీఆర్ భయంతో అధికారులు పని చేసేవారు.. మంత్రులను కలిసే పరిస్థితి రాలేదు. కానీ ఇప్పుడు కరెంట్ కనెక్షన్ కోసం ఫోన్ చేసినందుకు రూ. 25 లక్షలు తీసుకున్నారట. ఈ విషయాన్ని సదరు బిల్డర్ చెప్పి బాధపడినట్లు కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.

**బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు..**
**ఇది తెలంగాణ ప్రజల గొంతుక : కేటీఆర్**

బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ



పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

**చిట్టి నాయుడి పాలనలో ప్రతి ఒక్కరికి బాధలే..**
**నిప్పులు చెరిగిన కేటీఆర్**

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చిట్టి నాయుడి పాలనలో ప్రతి ఒక్కరి బాధ పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నో ప్రాణత్యాగాలతో ఏర్పడ్డ రాష్ట్రం ఇది. మీ త్యాగాలతో పునీతమైన నేల ఈ తెలంగాణ నేల. ఈ పదేండ్లలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో పని చేశాం. నీళ్లల్లో సంపూర్ణమైన విజయం సాధించాం. కాళేశ్వరం వంద శాతం పూర్తయింది. పాలమూరు - రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులు 95 శాతం పూర్తయ్యాయి. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చి దశాబ్దాల తాగునీటి గోసను సమూలంగా తుడిచిపెట్టాం అని కేటీఆర్ తెలిపారు.

**ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌కే..**

నిధుల విషయానికి వస్తే.. 2014లో తలసరి ఆదాయంలో తెలంగాణ 14వ స్థానంలో ఉండే. గతేడాది కేసీఆర్ దిగిపోయే నాటికి తలసరి ఆదాయంలో నంబర్ వన్ స్థానానికి ఎదిగాం. అన్ని వర్గాల కుటుంబాల్లో ఒక ఆర్థిక భరోసా నింపామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలంగాణ భవన్‌కు వస్తున్నారు.. 10 జిల్లాల నుంచి ఆశా కార్యకర్తలు వచ్చి తమ బాధలు చెప్పుకున్నారు. మా జీతం రూ. 1500 ఉంటే.. అడగకముందే రూ. 9900 చేసిన మహానుభావుడు కేసీఆర్ అని ఆశా కార్యకర్తలు తెలుపుతున్నారు. మాకు ఆశ పెట్టి మోసం చేశారని ఆవేదన చెందారు. 9 వేలు ఏంది.. 18 వేలు ఇస్తామని చెప్పి పత్తా లేకుండా పోయారు. మా కోసం మాట్లాడండి అని కోరారు. సందర్భానుసారంగా సమావేశాలు నిర్వహించి చిట్టి నాయుడిని వణికించి, న్యాయం చేస్తామని ఆశా కార్యకర్తలకు భరోసా ఇచ్చినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

**95 శాతం రిజర్వేషన్లకు తూట్లు..**

గ్రూప్-1 వాయిదా కోసం అశోక్ నగర్‌లో నిన్న రాత్రి అభ్యర్థులు రోడ్డెక్కారు. రిజర్వేషన్ల అమలు విషయంలో అన్యాయం జరుగుతుంది. 95 శాతం రిజర్వేషన్లకు తూట్లు పొడుతున్నారు. మాకు ఉద్యోగాలు రాకుండా చిట్టి నాయుడు మోసం చేస్తున్నారని అభ్యర్థులు ఆరోపించారు. 60 శాతం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కల్పించేవారు. మిగతా 40 శాతం ఓపెన్ కోటాలో జనరల్ కేటగిరిలో కూడా మెరిట్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించేవారు. కానీ ఇవాళ దాన్ని కూడా తుంగలో తొక్కారు. జీవో 55ను రద్దు చేసి జీవో 29ని అమలు చేస్తున్నారు. పరీక్ష రాసేందుకు మాకు అభ్యంతరం లేదు. 3 లక్షల మందిలో 30 వేల మందికి మేం క్వాలిఫై అయ్యాం.. కానీ పరీక్ష రాసిన తర్వాత.. కాంగ్రెస్ ప్రభుత్వం లోపభూయిష్ట ఉత్తర్వులు తప్పని పరీక్షలను రద్దు చేస్తే మళ్లీ రాయాల్సిన పరిస్థితి వస్తదని గ్రూప్-1 అభ్యర్థులు అంటున్నారు.

**రైతులు తిట్టని తిట్టు తిడుతున్నారు..**

సీఎం రేవంత్ రెడ్డి మూర?పు విధానాల వల్ల గాంధీ భవన్, బీజేపీ ఆఫీసు వైపు జనాలు చూడడం లేదు. చలో తెలంగాణ భవన్ అని ఇటు వైపు వస్తున్నారు. హైడ్రా బాధితులు కూడా వచ్చారు. చిట్టి నాయుడి పాలలో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. రైతులు తిట్టని తిట్టు తిడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వలేదు. బతుకమ్మ చీర దిక్కు లేదు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మ చీరలు, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా వచ్చేవి అని ఆడబిడ్డలు బాధపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని కేటీఆర్ తెలిపారు.

# కౌంటర్లకు ప్రతి కౌంటర్లతో గులాబీకి డైలమా

**హైదరాబాద్ :** బీఆర్ఎస్‌కు అన్ని బ్యాక్ ఫైర్ అవుతున్నాయి. ఏ అంశంతో ముందుకు వెళ్లామనుకున్న సక్సెస్ కావడం లేదనే అభిప్రాయం పార్టీ నేతల్లో ఉంది. అమృత్ స్కీంలో స్కాం ఆరోపణలు.. మూసీ లూటిఫికేషన్ కామెంట్.. హైడ్రా విషయంలో ఆర్డినెన్స్‌తో బ్రేక్.. ఇప్పుడు నేవీ రాడార్ స్టేషన్‌లోనూ చేసిన వ్యాఖ్యలన్నీ రివర్స్ అవుతున్నాయి. అన్నీ గత ప్రభుత్వ నిర్ణయాలేనని ప్రస్తుత సర్కారు క్లారిటీ ఇవ్వడంతో పాటు సీఎం వేదికలపై స్పష్టంగా చెబుతుండటంతో కక్కలేక మింగలేని పరిస్థితి బీఆర్ఎస్‌కు నెలకొంప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ భావించింది. ప్రస్తుతం చేసే పనులన్నీ ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా చేస్తున్నారని పార్టీ వర్కింగ్ కేటీఆర్ తన విమర్శలతో స్పీడ్ పెంచారు. కానీ ఆయన వ్యూహాలన్నీ బెడిసి కొడుతున్నాయి. ప్రతి అంశం ఫెయిల్ అవుతోందని పార్టీలోనే చర్చకు దారితీసింది. అమృత్ స్కీం టెండర్లలో అవినీతి జరిందని.. ఏకంగా రూ.8,888 కోట్ల స్కాం జరిగిందంటూ కేటీఆర్ ఆరోపించారు. అందులో సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది అయిన సృజన్‌రెడ్డికి సంబంధించిన కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్లు కట్టబెడ్డారంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై సృజన్‌రెడ్డి స్పందించి కేటీఆర్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ నోటీసులో తెలిపారు. తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.ప్రతిసారి తనపై ఆరోపణలు చేసే ప్రత్యర్థి పార్టీల లీడర్లకు లీగల్ నోటీసులు పంపే కేటీఆర్‌కు.. సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపించడం ఇప్పుడు పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కూడా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అమృత్ టెండర్లపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. సృజన్‌రెడ్డి అనే వ్యక్తి రేవంత్‌రెడ్డికి సొంత బావమరిది కాదని.. తనకు అల్లుడు అవుతారని చెప్పుకొచ్చారు. సృజన్‌రెడ్డికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.మూసీ ప్రక్షాళనపై కేటీఆర్ తీవ్రవిమర్శలు చేశారు. హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట అని మండిపడ్డారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమిషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు అని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు.. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట... ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే అని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు. మూడ్రోజులపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇండ్లు కోల్పోతున్నవారికి 'డబుల్' ఇండ్లు, రూ.25 వేలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య కల్పిస్తామనే భరోసా ఇచ్చారు. 2017లో బీఆర్ఎస్ మూసీ సుందరీకరణకు రూపకల్పన చేసిందని దానినే కొనసాగిస్తున్నామని సీఎం వెల్లడించారు. దీంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా డైలమాలో పడింది.హైడ్రా విషయంలోనూ బీఆర్ఎస్‌కు బ్యాక్ ఫైర్ అయింది.

## మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధం కావాలి

-మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండా పోయింది. తేనే పూసిన కత్తిలా ఆయన మాటలు ఉంటాయి. ప్రజలను నమ్మించడంలో ఘనుడే.. మోసం చేయడంలో అంతకంటే ఘనుడు. మాదిగల పట్ల ఆయన మాటలు తేనే పూసినట్టు ఉంటాయి. కానీ అవి మాకు తీపిని అందించవు. మాకు చేదుగానే, మోసంగానే ఉంటాయని మందకృష్ణ తెలిపారు. పరీక్షల నిర్వహణ కానీ అన్ని నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని రేవంత్ రెడ్డి శాసనసభా వేదికగా చెప్పాడు. దీన్ని కూడా ఆయన విస్మరించాడు. ఇవాళ మాదిగల పొట్ట కొట్టింది రేవంత్ ప్రభుత్వం. 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసి అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించారు. ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే అంతకుముందున్న నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామన్న రేవంత్.. అది అమలు చేయకుండానే నియామక పత్రాలు అందజేశారు. ఇంది మాదిగ బిడ్డల పొట్ట కొట్టినట్టు కాదా..? అని రేవంత్ రెడ్డిని మందకృష్ణ మాదిగ నిలదీశారు.

## గ్రూప్-1 పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి

-మొదటిపేజీ తరువాయి



ఎండీ ముస్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

## 23న తెలంగాణ కేబినెట్

-మొదటిపేజీ తరువాయి

సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరుగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ప్రకటన జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. హైడ్రాకు చట్టబద్ధతతో పాటు అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించనున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారాలు ఇటీవలనే హైడ్రాకు కట్టబెడుతూ పురపాలకశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ యాక్ట్ చట్ట సవరణ బిల్లుపై కేబినెట్ లో చర్చించే అవకాశం ఉంది. ఇక వచ్చే అసెంబ్లీ సమావేశాల నిర్వహణతో పాటు చర్చించే అంశాలపై కూడా సమాలోచనలు చేయనున్నారు. ఇవే కాకుండా ఇందిరమ్మ ఇళు ్ల, కొత్త రేషన్ కార్డులతో పాటు కుల గణన వంటి అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది..!మరోవైపు తెలంగాణ ప్రభుత్వం మూసీ ప్రక్షాళలను సీరియస్ గా తీసుకుంది. పరివాహన ప్రాంతంలో ఉన్న నిర్వాసితులకు ఇళ్లను కేటాయించే పనిలో పడింది. ఇప్పటికే చాలా ఇళ్లకు మార్కింగ్ కూడా చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా మూసీ సుందరీకరణను తీసుకుంది. ఈ నేపథ్యంలో కేబినెట్ భేటీలో ఈ విషయంపై లోతుగా చర్చ జరిగే అవకాశం ఉంది.ఇక రాష్ట్రంలో చాలా మంది రైతులు పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం తీసుకొచ్చిన రైతు భరోసా స్కీమ్ పై కేబినెట్ చర్చించనుంది. విధివిధానాలను ఖరారు చేసే అంశంపై సమాలోచనలు చేయనుంది. ఇక రుణమాఫీ స్కీమ్ కూడా చర్చకు రానుంది. ఈ నెలాఖారులోపు మిగిలిపోయిన రైతులకు కూడా రుణమాఫీ స్కీమ్ వర్తింపజేస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై కూడా కీలకంగా చర్చించే అవకాశం ఉంది.

## పెరగనున్న మద్యం ధరలు..

**హైదరాబాద్:** తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

**17 లక్షల బీర్లు..**

రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

**స్వల్పంగా తగ్గిన ఆదాయం..**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం. బడ్జెట్ ప్రవేశ పెట్టగా వ్యవసాయానికి ఎక్కువ ప్రియారిటీ ఇచ్చారు. అయితే బడ్జెట్ సమావేశాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తుంది..పండుగలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ఖచ్చితంగా మద్యం ఉండాల్సిందే . ఎన్నికల సమయాల్లో మందు ఏరులై పారుతుంది. మద్యంతో ఎంజాయ్ చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# సంపాదకీయం

## కయ్యానికి.. కెనడా

కెనడా ప్రధాని ఓవరాక్షన్ రాను రానూ మితిమీరుతోంది. భారత్‌తో కయ్యం కోసం కాచుక్కుచ్చున్నట్లు కనిపిస్తుంది. తమ దేశానికి వలసొచ్చిన తీవ్రవాది కోసం దేశ భవిష్యత్తునే పణంగా పెడుతున్నాడు. కెనడాలోని సిక్కుల ఓట్ల కోసం సిగ్గు లేకుండా భారత్‌తో దౌత్య సంబంధాలను దెబ్బతీస్తున్నాడు. తమ దేశంలో జరిగిన ఓ తీవ్రవాది హత్యకు ఇటీవల భారత్‌ను నిందించిన ట్రూడో.. ఇప్పుడు, భారత్‌లో జరిగిన హత్యకు కారణమైన బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నాయని ఆరోపించాడు. ఈ ముఠాతో కెనడాలో హత్యలు చేయిస్తున్నారంటూ నోరు పారేసుకున్నాడు. ఏ దేశమైనా మరో దేశ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చాలంటే ఒక అంతర్జాతీయ కారణం ఉండాలి. లేదంటే, అది తమ దేశంపై ఏదైనా ప్రభావం చూపుతుండాలి. అదీకాదూ అంటే, మానవహక్కుల ఉల్లంఘన వంటి వ్యవహారాల్లో కలుగుజేసుకోవచ్చు.. ఓ సలహా ఇవ్వొచ్చు, అభిప్రాయం వ్యక్తీకరించొచ్చు. అలాకాదని, కేవలం వారి రాజకీయ లాభాల కోసం మరో దేశంపై బురద చల్లాలనుకోవడం అవివేకమే అవుతుంది. కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఇదే చేస్తున్నాడు. అమెరికా, చైనాలు సైతం భారత్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. అలాంటిది కెనడా లాంటి కంట్రీలకు అంత తలపొగరు ఉండటం కాస్త ఆశ్యర్యం కలుగజేస్తుంది. అయినా, కెనడా కయ్యం కావలి అనేటట్లే వ్యవహరిస్తోంది. భారత ప్రభుత్వంపై కెనడా తాజాగా మరోసారి ఆరోపణలు చేసింది. కెనడా గడ్డపై జరుగుతున్న తీవ్రమైన నేరపూరిత చర్యల్లో భారత్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆరోపించింది. అయితే, కెనడా అధికారులు, తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలను చూపించలేదు. కెనడాలో ఖలిస్థాన్ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకోవడానికి, లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నారని కెనడా ఆరోపించింది. యాదృచ్ఛికంగా.. అక్టోబర్ 12న ముంబైలో జరిగిన ఎన్సీపీ నేత బాబా సిద్ధిక్ హత్యలో లారెన్స్ బిష్ణోయ్‌కు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న సమయంలో.. కెనడా వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య గ్యాప్ మరింత పెరగడానికి కారణం అయ్యాయి. అక్టోబర్ 14 అర్ధరాత్రి ప్రెస్‌తో మాట్లాడిన రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారులు భారత్‌ను నిందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది కెనడాలో హత్యకు గురైన ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించిన దర్యాప్తు వివరాలను ఈ ప్రెస్‌మీట్‌లో పంచుకున్నారు. దీనితో, పాటు ఇతర సంబంధిత కేసుల్లోనూ భారత ఏజెంట్లు ప్రమేయం ఉందని వెల్లడించారు. కెనడాలో హత్యలు, హింసాత్మక చర్యలకు భారత ప్రభుత్వం హస్తం ఉందని అన్నారు. నిజ్జర్ హత్యలో అనుమానితుల జాబితాలో కెనడాలోని భారత్ హైకమిషనర్ సంజయ్ వర్మ, ఇతర దౌత్యవేత్తల పేర్లను చేర్చారు. అలాగే, కెనడాతో పాటు విదేశాల్లోని పలు సంస్థలను భారత ప్రభుత్వ ఏజెంట్లు సమాచార సేకరణకు ఉపయోగించుకుంటున్నారని కెనడా ఆరోపించింది. కొందరు వ్యక్తులు, సంస్థలను భారత ప్రభుత్వంతో కలిసి పని చేయమని ఒత్తిడి చేసి, బెదిరిస్తున్నారనీ.. ఇక, సేకరించిన సమాచారం ఆధారంగా కెనడాలోని సౌత్ ఏషియా కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడానికి భారత ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ ప్రకటించింది. 2022 జూన్ నెలలో, సింగర్ సిద్ధూ మూస్ వాలా హత్య తర్వాత పంజాబ్‌లో హింసాత్మక నేరాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌స్టర్ల ప్రమేయంపై కెనడాను భారత హైకమిషన్ అప్రమత్తం చేసింది. మూస్ వాలా హత్యకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించగా? ఉత్తర భారతదేశంలో క్రైమ్ చేస్తున్న బిష్ణోయ్ ముఠా, ప్రధానంగా కెనడాలో దాని ఉనికికి సంబంధించి భారత్ కెనడాను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో.. తాజా ప్రెస్‌మీట్‌లో దీనిపై ప్రశ్నోత్తరాలు నడిచాయి. సిక్కు సంఘంలోని సభ్యులను భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నారా అని కెనడా పోలీస్ అధికారులను జర్నలిస్టులు అడిగారు. దీనికి, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ బ్రిగిట్టే గౌవిన్ మాట్లాడుతూ, దక్షిణాసియా సమాజాన్ని ఈ భారత్ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నాయని.. ప్రత్యేకంగా కెనడాలోని ఖలిస్తానీ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వ్యవస్థీకృత నేరాలు చేస్తున్న బిష్ణోయ్ గ్రూప్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో లింక్ ఉందని మేము నమ్ముతున్నామంటూ గౌవిన్ వెల్లడించారు. కెనడాలో అతిపెద్ద తీవ్రవాద దాడికి కారణమైన ఖలిస్తానీ ఉగ్రవాదులకు కెనడా ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని భారత్ కూడా ఆరోపిస్తోంది. 1985లో ఎయిర్ ఇండియా ఫ్లైట్-182పై బాంబు దాడిలో 329 మంది మరణించారు. అప్పటి నుండీ భారతదేశాన్ని నిందించడానికి, కెనడాలో భారత్ ప్రతిష్టకు భగం కలిగించడానికి ఖలిస్తానీలు పదేపదే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. సిక్కు వేర్పాటువాదులైన ఖలిస్థానీ తీవ్రవాదులు చేసే వ్యవస్థీకృత నేరాలతో సంబంధాలున్న వ్యక్తులకు కెనడా రక్షణ కల్పించడపై భారత్ దశాబ్ధాలుగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే, ఈ ఏడాది మేలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. నిజ్జర్ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు భారతీయులను అరెస్టు చేసిన తర్వాత కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాన్ని విమర్శించారు. పంజాబ్ నుండి వ్యవస్థీకృత నేరాలతో లింక్‌లు ఉన్న చాలా మంది ఖలిస్థానీ తీవ్రవాదులను కెనడా స్వాగతిస్తుందనీ ఆరోపించారు. వీళ్లు భారతదేశంలో వాంటెడ్ క్రిమినల్స్ అనీ.. మీరు వారికి వీసాలు ఇచ్చారని కెనడా ప్రభుత్వాన్ని విమర్శించారు. కాగా, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ హత్య జరిగిన రెండు రోజులకే బిష్ణోయ్ ముఠా సభ్యులతో భారతీయ ఏజెంట్లు కుమ్మక్కయ్యారని కెనడా ఆరోపించింది. ఇక, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ వ్యాఖ్యల తర్వాత, కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో మీడియాను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కేసుపై భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎన్నిసార్లు అభ్యర్థించినప్పటికీ భారత్ సహకరించట్లేదని పేర్కొన్నారు. అయితే, ఎలాంటి ఆధారాలు చూపకుండా నిరాధార ఆరోపణలు చేసినందుకు భారత ప్రభుత్వం కెనడాపై తీవ్రంగా మండిపడుతోంది. అక్టోబర్ 14న భారత హైకమిషనర్‌పై కెనడా అధికారులు ఆరోపణలు చేసిన తర్వాత, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఘాటైన ప్రకటనను విడుదల చేసింది. కెనడా ప్రధాని ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నట్లు పేర్కొంది. దీనికి నిరసనగా, ఆరుగురు కెనడియన్ దౌత్యవేత్తలను బహిష్కరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, కెనడాలోని తమ హైకమిషనర్ సంజయ్ వర్మతో పాటు, మరికొందరు దౌత్యవేత్తలను కాల్ బ్యాక్ చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే, భారత్ ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. ఆరుగురు భారత దౌత్యవేత్తలను తామే బహిష్కరించామని ఆయన చెప్పారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వం సహకరించకపోవడమే ఇందుకు కారణమని ట్రూడో అన్నారు.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్ నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. రావూరి భరద్వాజ (జూలై 5, 1927 - (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మ కథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచిం చారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగ ణింప బడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబ రాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక



ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరధ్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాద మైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇసుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

# సిద్ధిపొందిన విద్యా తాపసి

ఉన్నత ప్రమాణాలు గల విద్యా వేత్తగా, సమున్నత ఆశయాలు గల ఉత్కృష్ట వ్యక్తిగా, విద్యా రంగానికి సక్రమ దిశా నిర్దేశం చేసేందుకు, నిరంతరం శ్రమించి, జీవితాన్ని విద్యారంగ అభి వృద్ధికి అంకితం చేసి, లక్ష్య సాధనలో సిద్ధి పొంది, వినూత్న కార్యక్రమాల సృష్టికర్తగా, పేరెన్నిక గన్న బహుముఖ ప్రజ్ఞాశాలి ముద్దు రామ కృష్ణయ్య. అవిభక్త కరీంనగర్ జిల్లాలో గోదావరి నదీ తీరాన వెలసి, నిరంతర వేద ఘోషతో, యజ్ఞ యాగాది హెూమ దూమాధులతో, సనాతన సంప్రదాయాలకు అనాదిగా నిలయమైన, మంథని గ్రామం లో, 1907 అక్టోబర్ 18న సాంప్రదాయ పేద కుటుంబాన, ఆయన జన్మించారు. సనాతన ఆచారాలను కాదని, మహా సముద్రాలు దాటి, ఖండాంత రాలలో తిరిగి, వేలాది మందికి క్రమశిక్షణాయుత, బాధ్యత పూర్ణమైన విద్య గురించి, పూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించి, పూజ్య "పితాజీ" గా శిష్యకోటికి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహామనిషి రామ కృష్ణయ్య. ఆంగ్ల విద్యను నేర్చు కోవడమే గొప్పనైన ఆ రోజుల్లో, జ్ఞాన సముపార్జన ధ్యేయంగా, కటిక దారిద్ర్యాన్ని మరిచి, ఉజ్వల విద్యారంగ భవిష్యత్తు కోసం పరితపించి, ఎన్నో బాలారిష్టాలను ఎదుర్కొని, ఇంగ్లాండ్ వెళ్లి విద్యాభ్యాసం కోసం ఒక హెూటల్ నౌకరుగా, చౌకీదారుగా పనిచేసిన కృషీవలుడు ఆయన. అనంతర కాలంలో తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుని, పర భాష పై పట్టు సాధించి, ప్రతిష్ఠాత్మక "బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్" (బి. బి. సి) లో, న్యూస్ రీడర్ గా పని చేసిన ప్రతిభాశాలి. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, అమెరికాలోని పలు రాష్ట్రాలు, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా" లాంటి దేశాలు పర్యటించి అక్కడి విద్యను, సంస్కృతి సభ్యతలను, సాంప్రదాయా లను, క్షుణ్ణంగా పరిశీలించి, అనుభవాలను జ్ఞాపకాలను మదిలో నింపుకున్న విజ్ఞాన ఖని ఆయన. అనంతర కాలంలో భారతదేశానికి తిరిగి వచ్చి విజయవాడ "ఆల్ ఇండియా రేడియో"లో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసి తన లక్ష్యం గమ్యం అది కాదని భావించి విద్యా రంగాన్ని సమూలంగా మార్చాలని ఎంచి, ఆ రంగానికి సేవ చేయ కృత నిశ్చయు డు అయినారాయన. స్వీయ అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశానుసారం, నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, తర్వాత వరంగల్ బీ.ఈ. డీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా, పనిచేసి, రాష్ట్రంలో బహుళార్ధ సాధక పాఠశాలల ప్రారంభించు, నూతన పథకం నేపథ్యంలో, నేటి జగిత్యాల జిల్లా కేంద్రంలో "మల్టీపర్పస్" (బహుళార్ధసాధక ఉన్నత పాఠశాలల) ప్రిన్సి పల్‌గా తానే స్వయంగా, కోరుకుని, 1958 - 59 విద్యా సంవత్స రంలో నియుక్తులు అయినారు. "ఓల్డ్ హై స్కూల్" గా నేడు చిర పరిచితమైన జగిత్యాల బహుళార్ధ సాధక ఉన్నత పాఠశాలలో ఆ రోజులలో "వందమంది ప్రజ్ఞా వంతులైన ఉపాధ్యాయ బృందానికి" మార్గ నిర్దేశం, "రెండు వేల మంది విద్యార్థులకు" విద్యా బోధన గరపడానికి అంకితభావంతో, చిత్తశుద్ధితో, సమయ పాలనతో, సాధికారత యుక్త, క్రణ శిక్షణతో పని చేశారంటే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. అరుదైన వ్యక్తిత్వం, హాస్య భరిత ప్రసంగం, నిస్వార్థం, మానవత్వం, సౌమ్య సామాన్య జీవితం, నిరాడం బరం, మూర్తీభావించిన ముద్దుగారే ఆయన ఆదర్శ జీవితం, ఎన్నో జీవితాలను ప్రభావితం చేసి, బంగారు బాటలో పయనింప చేసింది. 26 - 6 - 1965 వరకు పదవీ విరమణ చేసే సమయం వరకు, వందలాది మంది విద్యార్థులను తీర్చి దిద్ది, వారి అభిమానానికి పాత్రుడై, ప్రేమాభిమానాలతో "పితాజీ" అని పిలిపిం చుకున్న ముద్దు రామకృష్ణయ్య, విద్యా బోధనతో పాటు పాఠశాల రూపురేఖల ను మార్చి, "ఈత కొలను" నిర్మించి, అన్ని "తరగతి గదులలో", ఆనాడే "స్పీకర్ లను" అమర్చి, పెద్ద కంట్రోల్ పెట్టెలను తన గదిలో అమర్చి, అక్కడి నుండే అంటే తన చాంబర్ నుండి, "నేరుగా ప్రత్యేక విద్యార్థితో మాట్లాడే", ఆధునిక సాంకేతిక పోకడలు ఆనాడే ప్రవేశ పెట్టి ఆచరిం చిన, పితాజీ అమూల్య సేవలకు గుర్తింపు గా, జ్ఞాపకంగా, కృతజ్ఞతా పూర్వకంగా, రామకృష్ణయ్య "శత జయంతి వేడుకలను" ఘనంగా నిర్వహిం చారు. అదే స్ఫూర్తితో రామ కృష్ణయ్య శిష్యుడైన, గత జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా, జగిత్యాల ఓల్డ్ హై స్కూల్ లో 2010 వ సంవత్స రం సెప్టెంబర్ 7వ తేదీ మంగళ వారం "పితాజీ" "విగ్రహ విష్కరణ" గావించారు. రామకృష్ణయ్య ప్రియ శిష్యుడైన సూరజ్ శివ శంకర్ నిర్వహ ణలో, నాటి మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం అధ్యక్షతన, జిల్లాకు చెందిన ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విగ్రహ ఆవిష్కర్తగా, జగిత్యాల ఎమ్మెల్యే ఎలగందుల రమణ, మాజీ మంత్రి తాడిపర్తి జీవన్ రెడ్డి, నాటి జగిత్యాల ఆర్. డి. ఓ అమయ్ కుమార్, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్వర్ రాజు అదిగా ప్రముఖులు కార్యక్రమంలో భాగస్వాములై రామ కృష్ణయ్యకు ఘన నివాళులు అర్పించారు. ముద్దు జీవిత చరిత్రను ప్రభుత్వం గుర్తించి, 8వ తరగతి పాఠ్య పుస్తకంలో చోటు కల్పించి, అరుదైన గౌరవం కల్పించారు. రామ కృష్ణయ్య 114వ జయంతి సందర్భంగా సోమవారం పలువురి ఘనంగా నివాళులు అర్పించారు. శివ గాయత్రి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్దు రామకృష్ణయ్య ట్రస్టు అధ్యక్షులు సూరజ్ శివశంకర్, ఉపాధ్యక్షులు ఎలిమెలి సత్తయ్య, కాలగిరి బాపురెడ్డి, కప్పుల చంద్రమౌళి పడకంటి ఆనందం, పూటూరి నీలకంఠం, పూటూరి గౌరీ శంకర్, కారంగుల లక్ష్మణ్, సునిత తదితరులు పాల్గొన్నారు. అలాగే మంథని నియోజక వర్గ కేంద్రంలో 2013 జనవరి 25నాడు శ్రీ సీతారామసేవాసదన్ ఆధ్వర్యంలో మంథని తమ్మిచెరువు కట్టలోని మంత్రపురి దర్శన్‌వద్ద ముద్దు రామకృష్ణయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మంథని శ్రీ సీతారామ సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టునారా యణ గురూజీ సభాధ్యక్షతన, నాటి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విగ్రహావిష్కరణ గావించిన కార్యక్రమంలో నాటి నమస్తే తెలంగాణ పేపర్ సీఎండి సీఎల్ రాజం విశిష్ట అతిథిగా హాజరు కాగా, సదన్ అధ్యక్షుడు సువర్ణ లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు అష్టావధాని గంగాధర్, రామకృష్ణయ్య కుమార్తె పంగునూరి ప్రమీల, మను మడు, మనుమరాలు రామేశ్, అరుణ, విశేష అతిథులు రాంపెల్లి కిష్టయ్య, ప్రమోద్, గౌరవ అతిథులు సువర్ణ చంటయ్య, మాదాడి ప్రభాకర్ రె డ్డి, పనకంటి చంద్రశేఖర్, మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, గిరి నాగభూషణం, ఎంవీ నర్సింహాడ్డి, సూరజ్ శివశంకర్, ఎక్కటి అనంతడ్డి, సదన్ సభ్యులు అవధానుల మురళీ ధర్, దుద్దిళ్ల గణపతి, మార్వాక ప్రసాద్, టక్కెగారి కిట్టన్న, రామకృష్ణయ్య కుటుంబ సభ్యులు, సన్ని హితులు, జగిత్యాల శిష్య బృందం, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే.. పేదల సంజీవని

ఆధునిక కాలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు, పథకాల అమలుకై సర్వేలు ప్రధాన ఆధారం అవుతున్నాయి. అలాంటి సర్వేనే తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కేబినెట్ ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. దీనిని వెనువెంటనే నిర్వహించాలని గత వారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సర్వేను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి (డోర్ టు డోర్) చేయడానికి గాను ఆరవై రోజులు గడువును విధించారు. దీన్ని పర్యవేక్షించడానికి నోడల్ అధికారిని కూడా నియమించారు. రాష్ట్రంలో నూతన జనాభా లెక్కలు అయ్యే వరకు ఈ వివరాలనే రాష్ట్ర సర్కార్ ప్రామాణికంగా తీసుకోనుంది. భారతదేశంలో అత్యధికులు పేదవారు. దీనికి తెలంగాణ రాష్ట్రమేమీ మినహాయింపు కాదు. దేశంలో 28 శాతం కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయని వివిధ సర్వేలు తేల్చి చెప్పాయి. దాదాపు అదే స్థాయిలో పేద కుటుం బాలు రాష్ట్రంలోనూ ఉన్నాయి. అలాంటి వారి వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని పేద కుటుంబాల వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే ఉపయోగపడుతుంది. ఇది ఒక రకంగా కులగణనకు ప్రాధాన్యం ఇస్తూనే ప్రతి ఇంటిని (కుటుంబాన్ని) ఒక యూనిట్‌గా చేసుకుని అన్ని అంశాలను సేకరించేలా ప్రణాళికలను రూపొందించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వే ప్రధానంగా ఐదు అంశాలపై (కులాన్ని కలిపితే ఆరు అంశాలు) దృష్టి పెట్టనున్నది. కుల వివరాలతో పాటుగా ఆయా కుటుంబాలలోని విద్య, ఉపాధి (ఉద్యోగ), సామాజిక, రాజకీయ, ఆర్థిక వెనుకబాటుతనానికి సంబంధించిన విషయాలను నమోదు చేయనున్నది. పేదల సంక్షేమం, సామాజిక సమానత్వం, అభివృద్ధి, సాధికారత, ఆర్థిక స్వావలంబన వంటి వాటి ప్రాతిపదికన సర్వే జరుగుతుండటం గమనార్హం. ఈ సర్వేలో రాష్ట్ర బీసీ కమిషన్, స్టేట్ ప్లానింగ్ బోర్డులు సంయుక్తంగా అన్ని కులాల వివరాలను సేకరించనున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని బీసీ ఓటర్ల సంఖ్య ఎంత? రాజకీయంగా వారి వెనుకబాటుతనాన్ని అంచనా వేయ డంతో పాటు వారికి కేటాయించాల్సిన వాటాలను నిర్ణయించడానికి ఇది దోహదం చేస్తుంది. సర్వే వివరాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి బిసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌లను కమిషన్ ఖరారు చేయనున్నది. రాష్ట్ర ఎస్సీ జనాభా వివరాలు కూడా దీని ద్వారా తేలుతున్నందున ఎస్సీ వర్గీకరణ కోసం కులాలు, ఉప కులాలను గ్రూపుల వారీగా విభజించడానికి, వారికి ఇప్పటివరకు ప్రభుత్వపరంగా లభించిన సౌకర్యాలపైన కూడా స్పష్టత రానుంది. ఎస్సీ వర్గీకరణ అమలుకై సర్వే ఫలితాలను వాడుకోవచ్చును. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను మాత్రం 2011నాటి జనాభా లెక్కల ప్రకారం చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

# పోమల్ గ్రామంలోని సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంటును సందర్శించిన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ నీరజ ప్రభాకర్..





**మహబూబ్ నగర్,అక్టోబర్ 17** నవాబ్ పేట మండలం పోమల్ గ్రామంలో పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ బి.నీరజ ప్రభాకర్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ...అధిక మార్కెట్ రేటు పొందాలంటే గుజ్జు రంగు మారకుండా ఉండేందుకు కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంటూ సీతాఫలం మొక్కల్ని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇచ్చారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మరిన్ని ప్రయోగాలు చేసి ఈ ప్రాసెసింగ్ ఉత్పత్తులు ఎక్కువ మార్కెట్ ధర పొందేందుకు అవసరమైన పరిశోధనలు చేపట్టాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. బాలనగర్ సీతాఫలం రకానికి భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్ కై ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.వర్సిటీ అధికారి డాక్టర్ ఎం.రాజశేఖర్ డాక్టర్ పిడిగం సైదయ్య, పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి,సొసైటీ మెంబర్లు రామ్మోహన్ రెడ్డి,రాములు, శ్రీరాం అంజనేయులు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిగే గజేందర్ గౌడ్,నవపేట మండల బికెఎస్ ఉపాధ్యక్షులు రఘునందన్ రెడ్డి, పోమాల్ అధ్యక్షులు హరగణపతి,మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంతో మండల కాంగ్రెస్ నాయకులు, కొల్చారం మండల జర్నలిస్ట్ లు..



**కొల్చారం,అక్టోబర్17(సూర్యరేఖ)** కర్ణాటక రాష్ట్రం గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గురువారం దత్తాత్రేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.పౌర్ణమిని పురస్కరించుకొని దత్తాత్రేయ స్వామి దర్శనం కోసం వెళ్ళిన కాంగ్రెస్ నాయకులు, జర్నలిస్టులు మంత్రిని కలిశారు.ఆప్యాయంగా ప్రతి ఒక్కరిని పలకరించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అవసరమైతే హైదరాబాద్ కు వచ్చి తనను కలువమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేష్ గౌడ్,గౌడ సంఘం మండల అధ్యక్షులు నాయిని వెంకట్ గౌడ్ (గజినీ) లకు తెలిపారు.సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ తను కృషి చేస్తానని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్ట్ లు రామకృష్ణ గౌడ్,అశోక్ గౌడ్,లక్ష్మి నారాయణగౌడ్, శివకుమార్ గౌడ్,నర్సిములు,నాయకులు కొమ్ముల రాజగౌడ్, మహేష్ గౌడ్,సత్యం, శ్రీహరి, నాగరాజు తదితరులు ఉన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే.



**కామారెడ్డి,అక్టోబర్ 17(సూర్యరేఖ)**కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గురువారం ఉదయం తనిఖీ చేశారు.అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ను పరిశీలించారు.పాఠశాలలో పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

# కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు.



**కొల్చారం,అక్టోబర్ 17(సూర్యరేఖ)** కొల్చారం తాహసిల్దార్ కార్యాలయంలో గురువారం తాహసిల్దార్ గఫార్ మియా మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మహర్షివాల్మీకి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ గఫార్ మియా మాట్లాడుతూ. రాముడి దివ్య చరిత్రను మానవాళికి అందించిన వాల్మీకి మహర్షి మానవీయ విలువలను ప్రతిపాదిస్తూ ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన జ్ఞాన ఘని అని వేదాల సారాంశాన్ని, రాముని ఆదర్శాన్ని ప్రపంచానికి రామాయణం రూపంలో అందించిన "ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి" సందర్భంగా కొల్చారం మండల ప్రజలందరికీ మహర్షి వాల్మీకి జయంతిని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రామాయణాన్ని రచించి ఆది కవిగా పేరు ప్రఖ్యాతలు గావించిన వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో అతను మొదటి పురాణ గాథను రచించారు.కాబట్టి ఆయనకు ఆదికవి అనే బిరుదు ఉంది. వాల్మీకి రచించిన రామాయణానికి జీవితంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్పే జీవిత పాఠంగా నూ గుర్తింపు ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రభాకర్,శేఖర్ రెడ్డి,రెవెన్యూ సిబ్బంది సాయిలు, అమరేశ్వరి, నీరుడి శేఖర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విగ్రహాలు ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలి..

**నీట్టు వేణుగోపాలరావు.**



**కామారెడ్డి,అక్టోబర్17(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆలయాలను ధ్వంసం చేసి విగ్రహాలు,వస్తువులను దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ బోర్డ్ సొసైటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాలనీలో ఉన్న ముత్యాలమ్మ,పోచమ్మ, లక్ష్మమ్మ ఆలయాలను అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేసి విగ్రహాలు,విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారని వారు వివరించారు.నిందితులను తక్షణమే పట్టుకొని విగ్రహాలను రికవరీ చేయాలని సొసైటీ సభ్యులు కోరారు.పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు కార్యక్రమంలో ఆర్య క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు నిట్టు వేణుగోపాలరావు,స్థానిక కౌన్సిలర్ కృష్ణ మోహన్ రావు,ఆలయ పూజారితో పాటు కాలనీవాసులు ఉన్నారు.

## హనుమాన్ మందిరం పునఃప్రారంభ మహోత్సవంలో పాల్గొనాలని మంత్రికి ఆహ్వానం..



**అందోల్,అక్టోబర్ 17(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రం రాయికోడ్ లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభం మహోత్సవంలో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలలో 21వ తేదీ సోమవారం జరిగే వెదగోష, మంటప దేవత,షోడష ఉపచారపూజ, ధ్వజస్థంభం స్వస్తి వాచనం హెూమం,యంత్రప్రతిష్ఠ, మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహకు గ్రామ పెద్దలు,యువకులు,పలువురు నాయకులు కరపత్రాలను అందించి ఆహ్వానించారు.

# కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు.



**కామారెడ్డి,అక్టోబర్ 17(సూర్యరేఖ)** మహర్షి వాల్మీకి గొప్ప కవి అని,తత్వవేత్తగా పేరుగడించారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.మహర్షి వాల్మీకి జయంతినీ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించినందున గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. తొలుత జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మహర్షి వాల్మీకి జయంతి ఆశ్వీయుజ పౌర్ణమి రోజున నిర్వహించుకోవడం జరుగుతున్నదని తెలిపారు. మహర్షి వాల్మీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఒక కవిగా, తత్వవేత్తగా పెరుగడించారని,మహర్షి వాల్మీకిని ఆదికవిగా అభివర్ణిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చందర్,వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, కుల సంఘాల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## జహిరాబాద్ లో ఘనంగా వాల్మీకి జయంతి ఉత్సవాలు..



**అందోల్,అక్టోబర్17(సూర్యరేఖ)** వాల్మీకి జయంతి వేడుకలను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా జహిరాబాద్ లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ఏరియా హాస్పిటల్,బస్టాండ్ లో ముదిరాజ్ సంఘం నాయకులు పండ్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు పెద్దొడ్డి శంకర్ ముదిరాజ్,జిల్లా నాయకులు షికారి గోపాల్ ముదిరాజ్,జహీరాబాద్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నాయకుని రమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఏ.మహేష్ ముదిరాజ్,విట్టల్ ముదిరాజ్, తుకారం ముదిరాజ్,షికారి శ్రీనివాస్ లింగమయ్య,అర్జున్,హరీష్.పిట్టల రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త కుప్పలో వీర మల్లు,విగ్రహం పున:ప్రతిష్టించాలని గ్రామస్తులు డిమాండ్





**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామంలో చెత్త కుప్పలో ఓ పురాతన వీర మల్లు విగ్రహాన్ని పడేశారని గ్రామస్తులు తెలిపారు.గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి పరిసరాల్లో ఉన్న పురాతన వీరమల్లు విగ్రహాన్ని తొలగించి రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలో వేశారు.రోడ్డు పక్కన చేత్తలో ఉన్న వీరమల్లు విగ్రహాన్ని చూసిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు పిర్యాదు చేసిన్నట్లు తెలిపారు.వీర మల్లు విగ్రహాన్ని చెత్త కుప్పలో పడేసిన వారే గ్రామంలో తిరిగి ఆ విగ్రహాన్ని పున:ప్రతిష్టించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# 6 గ్యారంటీలతో ప్రజలకు న్యాయం..

**జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి.**



**కామారెడ్డి,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలతో పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని,సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందియ్యడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆమె తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.త్వరలో కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సలహాదారులు మాజీమంత్రి పార్టీ సీనియర్ నాయకుడు మహమ్మద్ షబ్బీర్ అలీ నాయకత్వంలో ఇందిరామ్మ కమిటీలు వేసి ఇంటింటా కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందిస్తామని ఆమె తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ సహాయదారులు షబ్బీర్ అలీ నాయకత్వంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇస్తామని ఆమె అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటా సర్వేను ప్రజలందరూ సహకరించి సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 20న కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న మద్ది చంద్రకాంత్ రెడ్డి ప్రమాణస్వీకారణ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకావాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ నాయకత్వంలో కామారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్దాం అన్నారు.

## మాందాపూర్ లో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి..





**అందోల్,అక్టోబర్17 (సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల మాందాపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పవిత్రగ్రంథం రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూల మాలలు వేసి పూజాకార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ మహానియుడి సేవలను స్మరించుకున్నారు. ప్రతి ఒక్కరు ప్రతివనంలో వాల్మీకి గురువు లాగా మన ముదిరాజులందరూ ప్రతి గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేసుకొని ప్రతి సంవత్సరం జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని ముదిరాజ్ బంధువులు సూచించారు.అలాగే సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్సై నారాయణని మాందాపురం ముదిరాజ్ బంధువులు ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజారామ్,బి.బీమన్న, బి.సిద్దయ్య,మామిడిపల్లి దుర్గయ్య, బి.అంజయ్య, ఇందూరి కిష్టన్న, ఇందూరి సంగన్న,బాబూసాబ్ సంగయ్య,మామిడిపల్లి లక్ష్మణ్,ఇ.లక్ష్మయ్య,బి. సంగమేశ్వర్, ఇ.అంజయ్య,బర్దిపూర్ రాములు,బిబి రాజు,బి.శంకర్, బి.వెంకటేశం,గోవింద్ అశోక్,బి. అశోక్ కుమార్,బి.రాజేందర్,వడ్ల దశరథ్,యం. చంద్రయ్య, యం.శ్రీనివాస్, యం.ప్రవీణ్, బి.జగదీష్, గోవింద్ శివకుమార్, బి.యాదవులు, బి.బక్కన్న,బి. పాండు,ఇ అనిల్ కుమార్, బి.నర్సింలు,గోవింద్ కృష్ణ,బి విష్ణు,పి.ప్రవీణ్, జి.చెంద్రశేఖర్,జి.అంజి,పీజీ బీరయ్య,పీజీ శంకర్,తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



**నిజాంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** మండల కేంద్రంలో ని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి తాహసిల్దార్ సురేష్ కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడి చరిత్రను తన రామాయణం ద్వారా సకల మానవాళికి అందించిన మహనీయులు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలోఆర్ ఐ గంగాధర్ గౌడ్, రమేష్, ప్రశాంత్, రాజలింగం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానంతోనే మూఢనమ్మకాల నిర్మూలన..







**మంత్రాలు,మూఢనమ్మకాలను నమ్మొద్దు..**

**సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్..**

**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** చేతబడి బాణమతి మంత్రాలు మూఢనమ్మకమని, విజ్ఞానంతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు.జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు రామాయంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై బాలరాజు అధ్యక్షతన మానవ విలువలు కాపాడుదాం – మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పులేటి నరేష్, ఎస్సై బాలరాజు హాజరై మాట్లాడుతూ... సమాజంలోని మూఢనమ్మకాలను వదిలిపెట్టి, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని అన్నారు. దొంగ స్వాములు,భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు,భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షోద్వారా విద్యార్థులకు ప్రదర్శించి, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హిమజ్యోతి,వైస్ ప్రిన్సిపల్ ప్రత్యూష, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మార్కెట్ కు గుండా మల్లేష్ పేరు నామకరణం చేయాలి..





**బెల్లంపల్లి,అక్టోబర్ 17(సూర్యరేఖ)** నూతన కూరగాయల మార్కెట్ సముదాయానికి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుండా మల్లేష్ పేరు నామకరణం చేయాలని సిపిఐ పార్టీ నాయకులు కోరారు.ఈ మేరకు సబ్ కలెక్టర్ ఆర్డీవో హరికృష్ణ,మున్సిపల్ చైర్ పర్సన్,మున్సిపల్ కమిషనర్ లకు వినతి పత్రం అందజేశారు.పట్టణ కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ. కూరగాయల వ్యాపారస్తులకు గత ఎమ్మెల్యేగా ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందించారన్నారు. వ్యాపారాల నిర్వహణకు సింగరేణి సంస్థ అధికారులతో మాట్లాడి స్థలాల కేటాయించేందుకు కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో గుండా సరోజ, చిప్ప నరసయ్య,సిపిఐ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ గేమ్..అప్పుల పాలు

**రమ్మీ ప్రిఫైర్,పబ్జి మత్తులో జోగుతున్న కుర్ర కారు..**

**బెట్టింగ్ లతో నష్టపోతున్న వైనం..**

**షేక్ జిపిఎస్ యాప్ లతో లొకేషన్ మార్పు..**

**నష్టపోతున్న బయటకు పొక్కకుండా జాగ్రత్తలు..**

**ఆన్ లైన్ గేములపై 2020లో నిషేధం విధించిన ప్రభుత్వం..**

**రామాయంపేట,అక్టోబర్17** పేకాట రాయుళ్లు ఆఫ్ లైన్ లో రమ్మీ ఆడటానికి ఇబ్బందులు పడుతూ..హాయిగా వారి మొబైల్ నుంచి ఆన్ లైన్ జూదం ఆడుతూ బానిసలుగా మారిపోతున్నారు.ఈ క్రమంలో బ్యాంకు అకౌంట్ నుంచి డబ్బులు ట్రాన్స్ఫర్ చేసి మరి గేమ్ ఆడుతున్నారు.ఈ బెట్టింగ్ లో ఒకేసారి ఆరుగురు ఆడటానికి అవకాశం ఉంది.అయితే జిల్లాలో అధిక శాతం ఆన్ లైన్ రమ్మీ ఆడుతున్నారు. అదేవిధంగా డ్రీమ్ లెవెల్ న్ వంటి నిషేధిత ఆన్ లైన్ గేమ్ బెట్టింగ్ యాప్ లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. చాలామంది యువత సాయంత్రం అయితే ఆలస్యం పబ్జి,ఫ్రీ ఫైర్ గేములలో డబ్బులు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికి పోతున్నారు.కొన్ని సందర్భాల్లో ఇవి యువత మధ్యన తగాదాలకు కూడా దారితీస్తున్నాయి.

### చాప కింద నీరులా..

యువత పనిమీద శ్రద్ధ పెట్టకుండా 24 గంటలు ఇలాంటి గేముల మోజులో పడిపోతున్నారు.పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోతున్నారు.గేమ్ ఆడే వారి సంఖ్య జిల్లాలో క్రమంగా పెరుగుతూ వస్తోంది.గేమ్ గురించి ఏమీ తెలియని వారు సైతం యూట్యూబ్ లో వీడియోలు చూసి నేర్చుకుంటున్నారు.




యదేచ్ఛగా బెట్టింగులు నిర్వహిస్తూ జీవితాలు చిన్న భిన్నం చేసుకుంటున్నారు.

### నిషేధం ఉన్నప్పటికీ..

పేకాటపై నిషేధం ఉన్నప్పటికీ ఆన్ లైన్ లో ఆడి రమ్మీ బెట్టింగ్ యాప్ లను యువత మెచ్చుకుంటున్నారు. ఈ గేమ్ ఉచ్చులో చిక్కుకొని అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి ఈ పరిస్థితి గమనించిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఆన్ లైన్ బెట్టి గేమ్లపై నిషేధం విధించింది.వివిధ రకాల ఆన్ లైన్ గేమ్ సంస్థలు నిలిపివేసింది.ఎవరైనా ఆ సైట్ లోకి వెళితే ఆ గేమ్ అందుబాటులో లేదని చూపిస్తుంది.వారి ఐపి అడ్రస్ తో పాటు లొకేషన్ వివరాలతో సహా ఆ యువకుడు ఎక్కడివాడో



ఇట్టే చెప్పగలిగే అవకాశం వెబ్ సైట్ నిర్వాహకుల వద్ద ఉండేది.

### నకిలీ జిపిఎస్ యాప్ తో..

ఎన్నో ఏళ్లుగా ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్ లకు బానిసలు గా మారిన ప్రబుద్ధులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకున్నారు.వారికి అనుకూలంగా ప్లే స్టోర్లో నకిలీ జిపిఎస్ యాప్లు వచ్చేసాయి.ఈ నకిలీ యాపులను తమ మొబైల్ ఫోన్ లో నిక్షిప్తం చేసుకుని తాము ఉన్న ప్రాంతం జిపిఎస్ లో కేషన్ వేరొక ప్రాంతం కింద చూపించే విధంగా సెట్టింగ్ మార్చుకుంటున్నారు.ఆన్ లైన్ జూదం గేమ్స్ నిషేధం విధించని రాష్ట్రాల లోకేషన్ ఈ యాప్ లలో అమర్చుకుని గేమ్ ఆడుతున్నారు.దీంతో లొకేషన్ వేరే ప్రాంతంలో చూపించడంతో గేమ్ ఆడేందుకు వెబ్సైట్ అంగీకరిస్తుంది.ఈ నేపథ్యంలో ఆన్లైన్ జూదం గేమ్స్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

# ఆధ్యాత్మిక వాతావరణంలో ఇంద్ర యజ్ఞం గ్రంథం ఆవిష్కరణ..

**రాజేంద్రనగర్,అక్టోబర్ 17** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.కుల వర్ణ ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటిదగ్గర సరళమైన రీతిలో యజ్ఞం చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ రూపొందించిన ఇంద్ర యజ్ఞం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.అరుణాచలం పుణ్యక్షేత్రంలో భగవాన్ రమణ మహర్షి,కావ్య కంఠ గణపతి ముని ఆశీస్సులతో. వేదములలో వివరించిన మంత్రముల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించడమైనది.ఈ పుస్తకంలో సరళంగా యజ్ఞం చేసుకునే విధానాలను,మంత్ర భావములతో సహా శ్రీ గణపతి ముని ప్రసాదించిన ఇంద్ర యజ్ఞంను వివరించినట్లు గ్రంథకర్త సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు,చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి హాజరయ్యారు.విశిష్ట అతిధులుగా రాష్ట్రీయ సేవికా సమితి నుంచి గౌద రమాదేవి,రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నుంచి రమా విశ్వనాథన్ విచ్చేశారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ గాయత్రీ తపోవనం ఆశ్రమ శిష్యులు అందరూ కలిసి



మూలకర్తలుగా నిలిచి నిర్వహించారు.అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరితో కుల ప్రాంత వర్ణ, లింగ విచక్షణ లేకుండా సామూహికంగా ఇంద్ర యజ్ఞం చేయించారు.ఇదే మాదిరిగా సరళమైన రీతిలో ప్రతి ఇంట్లోనూ ఇంద్ర యజ్ఞం జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన తాహసిల్దార్ రజనీకుమారి..



**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)**మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను రామాయంపేటలో ఘనంగా నిర్వహించారు.మెదక్ జిల్లా రామాయంపేట తాహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రజనీకుమారి,ఆర్ ఐ రాజు,కార్యాలయ సిబ్బంది మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసిల్దార్ రజనీకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జై వాల్మీకి అంటూ నినాదాలు చేస్తూ ఈ వేడుకలను ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమంలో ధరణి ఆపరేటర్ రమ్య,టైపిస్టు సుష్మ,జూనియర్ అసిస్టెంట్ సౌమ్య,కంప్యూటర్ ఆపరేటర్ బాబు,రోజా, సునీత, సాయిలు,పద్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా జోగులాంబ గద్వాల్ జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు..

**కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి**







రాజేంద్రనగర్, అక్టోబర్ 17 రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గద్వాల్ జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్కబాల్ రెడ్డి అన్నారు.బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు.బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణమ్మ సారథ్యంలో జోగులాంబగద్వాల్ జిల్లా ప్రజలు అందరూ అభివృద్ధి చెందుతారని అన్నారు.కోటి దాటి క్రియాశీల కార్యకర్తలు ఉన్న ప్రపంచంలోనే మొదటి రాజకీయ పార్టీగా ఉన్న బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. స్వయంగా ప్రధానమంత్రి మోడీ 50 క్రియాశీల సభ్యత్వాలు చేసి,ఆయన కూడా ఒక క్రియాశీల కార్యకర్తగా నిలవడం అందరూ ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. మొదట అలంపూర్ మున్సిపాలిటీలో స్థానిక నాయకులను కలుపుకొని ప్రతి ఇల్లు, వ్యాపార సంస్థ తిరుగుతూ బీజేపీ ద్వారా వారికి అందుతున్న పథకాలు వివరిస్తూ, పార్టీలో జాయిన్ అయ్యేలా వారిని ప్రోత్సహించారు. అనంతరం విశ్వకర్మ జయంతి సందర్భంగా గద్వాల్ పట్టణంలో ఉన్న ప్రధానమంత్రి కౌశల్ సమ్మాన్ యోజన కేంద్రం సందర్శించారు. అరుణమ్మ గద్వాల్ ప్రజలకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తారని, ఆమె నాయకత్వాన్ని బలపర్చాల్సిన బాధ్యత ప్రజలు అందరూ తీసుకోవాలని అన్నారు.గద్వాల్ పట్టణంలో ప్రజలు పెద్ద సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్,స్థానిక బీజేపీ నాయకులు నర్సింహ,చిత్తారి కిరణ్,గీతారెడ్డి, పాండు,శ్యామ్ సుందర్ రావు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**చేగుంట,అక్టోబర్ 17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండల చందయిపేట గ్రామ నివాసి విజయక్రాంతి జర్నలిస్ట్ గతకొన్ని రోజులుగ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఈ విషయం దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి,పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెంగళ్ రావు తెలుసుకొని వారి సగృహంలో వారిని పమర్శించారు. అనంతరం గ్రామంలో జరిగే శ్రీఆంజనేయ స్వామి వార్షికోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోనారు.ఈ కార్యక్రమంలో చేగుంట మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, మండల జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్,బిసి అధ్యక్షుడు అన్నం ఆంజనేయులు,ఎస్సీసెల్ అధ్యక్షుడు స్టాలిన్ నర్సింలు,నదిమ్,మెదక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవర్ధన్,అంచనూరి రాజేష్,సుధాకర్, శ్రీధర్ రెడ్డి,శ్రీను,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు అందరూ ఓటు నమోదు చేసుకోవాలి..

**తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్**



**చేగుంట,అక్టోబర్17(సూర్యరేఖ)** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తపస్ ఎప్పుడు ముందుందని తెలిపారు.రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో తపస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్,ఉపాధ్యాయులు రాజేశ్వర్,సుధాకర్ రెడ్డి, భవాని,శ్రీవాణి రమ,రమాదేవి,ఉమామహేశ్వరి, ఉమాదేవి,తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# హైడ్రా బాధితులకు అండగా ఉంటాం..








**ఇళ్లు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ మూడింతలు పరిహారం చెల్లించి ఖాళీ చేయించండి..**
**బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి**
**రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**రాజేంద్రనగర్,అక్టోబర్ 17** మూసీ సుందరీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కూల్చివేతలపై బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం అత్తాపూర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు.అత్తాపూర్ డివిజన్ లోని భరత్ కాలనీ,టీకేఆర్ కాలనీలు హైడ్రా మూసి ప్రాంతాలలో ఉన్నాయని,కాలనీలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ వేయడంతో విషయం తెలుసుకున్న కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి బాధితులను తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ... బాధితులకు బీజేపీ అండగా ఉంటుందంటూ ఆయన హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేయడం దారుణమని,ఈ కూల్చివేతలను బీజేపీ సహించదని ప్రభుత్వంపై మండిపడ్డారు.పేదల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వం బలవంతంగా కూల్చివేతలకు పాల్పడితే లక్ష మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇళ్లు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ మూడింతలు పరిహారం చెల్లించాకే ఇళ్లు ఖాళీ చేయించాలని కొండ విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.అనంతరం నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో హైడ్రా బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీజేపీ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పామన్నారు. ఇక్కడ హద్దు బందు 5 ఏళ్ల క్రితం పెట్టారని అది తెలుసుకునే ప్రజలు ఇక్కడ ఇల్లు కట్టుకొని ఉంటున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చి మార్కింగ్ వేయడం దుర్మార్గపు చర్య అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్తామని వీలైనంత త్వరలో కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.అదేవిధంగా కూలగొట్టే ఉద్దేశం ఉన్నట్లయితే ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్లు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే ఇక్కడికి రావాలని ఆయన స్పష్టం చేశారు.నాయ్యం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ధర్నాలు చేయడానికి సిద్ధమవుతామని, ప్రజలు అధైర్య పడొద్దని బీజేపీ పార్టీ అండగా ఉంటుందని స్థానికులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,వై. శ్రీధర్, కొమురయ్య,గౌరీ శంకర్,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్,వేణుగోపాల్ రెడ్డి,వెంకట్ రెడ్డి, అమర్,స్టార్ చిన్న ముదిరాజ్,స్థానికులు, కాలనీవాసులు, నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు మెడికల్ కిట్లను అందించిన కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్







**గండిపేట్,అక్టోబర్ 17** అయ్యప్ప స్వామి ఆశీస్సులతో స్వాముల పాదయాత్ర నిర్విరామంగా కొనసాగాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య అన్నారు.కొత్తూరులో అయ్యప్ప గురుస్వామి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది స్వాములతో అయ్యప్ప స్వామి మహా పాదయాత్ర కార్యక్రమం నిర్విరామంగా సాగాలని వేడుకుంటూ వారికి మెడికల్ కిట్ లను అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

# నార్సింగి సమీపంలో రోడ్డు ప్రమాదం సీనియర్ జర్నలిస్ట్,ప్రజాటైమ్స్ ఎడిటర్ రాములుగౌడ్ దుర్మణం





**సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి,ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,మాజీ మండలి చైర్మన్ స్వామిగౌడ్..**

**రాజేంద్రనగర్,అక్టోబర్17** టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ జర్నలిస్ట్ నిండు ప్రాణాలు బలి తీసుకుంది.ద్విచక్ర వాహనం వార్తల సేకరణలో భాగంగా వెళ్లి తిరిగి వస్తు క్రమంలో టిప్పర్ రూపంలో మృత్యువు ఆ సీనియర్ రిపోర్టర్,ప్రజా టైమ్స్ ఎడిటర్ ప్రాణాలను కభళించింది.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని జర్నలిస్టతో పాటు అన్ని పార్టీల నాయకులు, ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన ఈసంఘటన నార్సింగి – తారామతి బారాదరి ప్రధాన రహదారిలోని నెక్నాపూర్ పెట్రోల్ పంపు సమీపంలో గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి...హైదర్ గూడ ఎర్రబోడలో నివాసం ఉండే రాములుగౌడ్ సీనియర్ జర్నలిస్ట్.వివిధ పత్రికల్లో పని చేసిన ఆయన సొంతంగా ప్రజాటైమ్ పత్రికను స్థాపించి ఎటిటర్గా వ్యహరిస్తున్నారు. రాములుగౌడ్ స్వగ్రాయం కొండగల్ కోస్గి కాగా,చాలా ఏళ్ల క్రితం నగరానికి వచ్చి భార్య గీత,ఒక కుమారుడు కుమార్తెతో కలసి హైదరూడ సమీపంలోని ఎర్రబోడంలో నివాసం ఉంటున్నారు. కాగా,గురువారం వార్తల సేకరణలో భాగంగా నెక్నామ్పూర్ వైపు వెళ్లిన రాములుగౌడ్ తిరిగి తన ద్విచక్రవాహనంపై ఎర్రబోడకు భయలు దేరాడు. నార్సింగి తారామతి బారాదరి ప్రధాన రహదారిలోని నెక్నామూర్ కూడలి వద్ద ఉన్న పెట్రోల్ పంపులో తన వాహనంలో పెట్రోల్ పోసుకోవడానికి ఆగాడు. వాహనంలో పెట్రోల్ పోసుకుని బైక్ స్టార్ట్ చేసుకుని ముందుకు కదిలిన రాములుగౌడ్ వాహనాన్ని వెనుకాల నుంచి వేగంగా దూసుకువచ్చిన టిప్పర్ ఢీకొట్టింది.దాంతో రాములుగౌడ్ తీవ్ర గాయాలకు గురయ్యాడు.అదే సమయంలో అటుగా వెళుతున్న స్థానికులు,ఎర్రబోడ వాసులు ప్రమాదంలో గాయపడింది జర్నలిస్ట్ రాములుగౌడ్ అని గుర్తించి వెంటనే లంగర్ హౌస్ బాపూఘాట్ వద్ద ఉన్న రినోవా ఆసుప్రతికి తలించారు. అపస్మారక స్థితిలో ఉన్న రాములుగౌడ్ ను పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడు రాములు గౌడ్‌కు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం.



**రాములుగౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం :**

ప్రజా టైమ్స్ ఎడిటర్, సీనియర్ రిపోర్టర్ రాములు గౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించడం జీర్ణించుకోలేకపోతున్నామని సీనియర్ జర్నలిస్ట్ మ్యాథం మధు ఆవేధన వ్యక్తం చేశారు. ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన పలువురు జర్నలిస్టు కలసి రినోవా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే రాములు ఇకలేడు అన్న వార్త తీవ్రంగా కలసి వేసిందని ఆయన అన్నారు. టియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా నాయకుడు అప్పారెడ్డిగూడెం భీమయ్య,రాజేంద్రనగర్ సర్కిల్ యూనియర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్ రెడ్డి ,సూర్యనారాయణ,కోశాధికారి విజయ్,సహాయ కార్యదర్శి టి.లక్ష్మణ్,సర్కిల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బాలు, ప్రతినిధులు శ్రీకాంత్,నర్సింహా తదితరులు రాములుగౌడ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈసందర్భంగా వారు రాములుగౌడ్ కుటుంబానికి సాటి జర్నలిస్టుగా అండగా ఉంటామన్నారు.

## రోడ్డు మరమ్మతుల గురించి చర్చించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**చేగుంట,అక్టోబర్17 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట మండల పట్టణం నుండి గజ్వేల్ కు వెళ్లే రహదారి గుంతలు పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.స్థానికులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ రెండు పట్టణాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మతులు చేయించడానికి ఎమ్మెల్యే ముందు కొచ్చారు.ఇందుకు సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. వెంటనే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతులతో పాటు రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాలను ఏఈతో మాట్లాడి తొలగించాలని ఆదేశించారు.త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని ప్రజల హామీ ఇచ్చారు.అలాగే చేగుంట మండలంలోని పలువురికి లక్షా పదిహేను వేల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నారాయణ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి, స్థానిక తాజా మాజీ ఉపసర్పంచ్ సంతోష్ కుమార్, మాజీ జెడ్పిటిసి ముదాం శ్రీనివాస్,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్,జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి,రణం శ్రీనివాస్,మాజీ సర్పంచ్లు కొటారి అశోక్, కుమ్మరి శ్రీనివాస్,మోహన్, హళావతి,శ్రీనివాస్ నాయకులు డిష్ రాజు,ఆలం శ్రీకాంత్,సోషల్ మీడియా యాదగిరి,నాగరాజు, స్వామి గౌడ్,సురేష్ ముఖ్య నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**చేగుంట,అక్టోబర్17(సూర్యరేఖ)**మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చందాయిపేట, వడియారం,మక్కరాజ్ పేట గ్రామలలో ఐకెపి, పిఎసిఎస్ ల ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే చందాయిపేట గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి హనుమాన్ దేవాలయం వార్షికోత్సవంలో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నారాయణ,బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి,స్థానిక తాజా మాజీ ఉపసర్పంచ్ సంతోష్ కుమార్,మాజీ జెడ్పిటిసి ముదాం శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్,జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి,రణం శ్రీనివాస్, మాజీ సర్పంచ్లు కొటారి అశోక్,కుమ్మరి శ్రీనివాస్, మోహన్,హళావతి, శ్రీనివాస్ నాయకులు డిష్ రాజు, ఆలం శ్రీకాంత్,సోషల్ మీడియా యాదగిరి, నాగరాజు,స్వామి గౌడ్,సురేష్ ముఖ్య నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో స్కావెంజర్స్ నియామకాలు..



**చేగుంట,అక్టోబర్17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్కావెంజర్స్ గా పని చేయుటకు ఆసక్తిగల వారిని ఆహ్వానిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.ఈ స్కావెంజర్స్ నియామకానికి ఏడవ తరగతి చదివిన మహిళలు ఎవరైనా సరే ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోగలరని స్కూల్ యాజమాన్యం స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి తెలిపారు.

## ఇషా ఫౌండేషన్‌లో చిన్నారులపై వేధింపులు

**హైదరాబాద్ :** అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఇషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై వేధిం పులకు పాల్పడే వారి పెంపకానికి కేంద్రంగా నిలుస్తుంది అని మాజీ అధ్యాపకులు యామిని రాగానే తెలిపారు. హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.... ఆశ్రమ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు.. విష విద్య ఇషా ఉష సంస్కృతి ఇషా నిషా హోమ్ స్కూల్లో 8,000 మంది పైగా విద్యార్థులు న్నారని తెలిపారు. ఉషా సెంటర్లో విద్యా కార్యక్రమాల పేరుతో ఇషా సంస్కృతికి చెందిన బాలికల ను అత్యధిక దీక్షలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం జరిగినప్పుడు బయటకు రాకుండా మౌనం వహించారని వారు తెలిపారు. ఉష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు తాను సాక్షాతపరమైన ఆత్మ అని మరియు కరుణతో నిండి ఉన్నాడని ఇషా సంస్కృతి మరియు ఇషా విద్యార్థు లపై జరుగుతున్న ఆకృత్యాలపై ఎప్పుడు నోరు విప్పడం లేదని తెలిపారు. 12వ తరగతి చదువుతున్న ఆఱ్రెడీ మరణం యజమానియం నిర్లక్ష్యం వల్లే జరిగిం దని వివరించారు. ఇషా ఫౌండేషన్ ఇషా ఎడ్యుకేషన్ చేస్తున్న ఈ దురాగతాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## ఉపా చట్టం రద్దు చేయాలి

**హైదరాబాద్ :** ఉపా చట్టాన్ని రద్దు చేసి బేషరతుగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ప్రొఫెసర్ హర గోపాల్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. హైదారాబాద్ సిపిఐ ఆధ్వర్యంలో హైదారాబాద్ ఇందిరా పార్క్ వద్ద నల్ల దుస్తులను ధరించి నిరసన దీక్షకు దిగారు.

# ఒకే రోజు.. రెండు సినిమాల షూటింగ్స్ అంటోన్న భామ నిధి అగర్వాల్



ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ భామ ఖాతాలో పవన్ కల్యాణ్ నటిస్తోన్న హరి హర వీరమల్లు, ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్ సినిమాలున్నాయి. జ్యోతి కృష్ణ డైరెక్ట్ చేస్తున్న హరి హర వీరమల్లు చిత్రీకరణ విజయవాడలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. మరోవైపు రాజాసాబ్ షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఒకేసారి రెండు సినిమాల షూటింగ్స్‌లో పాల్గొంటూ బిజీగా ఉంది నిధి అగర్వాల్. ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా షేర్ చేసుకుంది. కళాకారుల జీవితం సర్‌ప్రైజ్‌లతో నిండి ఉంటుంది. కానీ కొందరు మమ్మల్ని నిజంగా ఆశీర్వదించినట్టు.. కృతజ్ఞతతో అనుభూతి చెందేలా చేస్తారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్ ఇండియా సినిమాలను ఒకే రోజున షూట్ చేసినందుకు సంతోషిస్తున్నా. అది కూడా ఒక సినిమా ఆంధ్రాలో.. మరో సినిమా తెలంగాణలో. రెండు రాష్ట్రాలు, ఒకే రోజు రెండు సినిమా షూటింగ్స్. మేమంతా ఏం చేశామో చూడాలని మీరంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఖచ్చితంగా ఈ రెండు సినిమాలు వేడుకగా జరుపుకునేలా ఉండబోతుతున్నాయని ట్వీట్ చేసింది. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో హరిహర వీరమల్లు రెండు పార్టులుగా వస్తోంది. మారుతి డైరెక్టర్ చేస్తున్న రాజాసాబ్ హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోంది.

# పవన్ కల్యాణ్ టైటిల్‌తో.. ప్రదీప్ మాచిరాజు

యాంకర్‌గా కెరీర్ మొదలుపెట్టి.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి.. హీరోగా మారిన వారి జాబితాలో ముందు వరుసలో ఉంటాడు ప్రదీప్ మాచిరాజు 30 రోజుల్లో ప్రేమించటం ఎలా? సినిమాతో హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు ప్రదీప్. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మ్యూజికల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రదీప్‌కు హీరోగా మంచి మార్కులే పడ్డాయి. చాలా రోజుల తర్వాత రెండో సినిమాను ప్రకటించేశాడు ఈ స్టార్ యాంకర్. ప్రదీప్ ఈ సారి పవన్ కల్యాణ్ సినిమా టైటిల్‌పైనే కన్నేశాడు. ప్రదీప్ నటిస్తోన్న తాజా చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరోయిన్లు ఒకరినొకరు చూసుకుంటూ చిరునవ్వులు చిందిస్తున్న స్టిల్ నెట్టింటిని షేక్ చేస్తోంది.

ఓ వైపు అందమైన ఊరు, మరోవైపు ఆయుధాలు చేత బట్టిన గ్రామస్థులు, క్లాస్ రూంలో ప్రదీప్, ఇంట్లో హీరోయిన్ కనిపిస్తున్న విజువల్స్‌తో కట్ చేసిన మోషన్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం ప్రేమ కథ నేపథ్యంలో ఉండబోతుందని హింట్ ఇచ్చేసినట్టు మోషన్ పోస్టర్ చెబుతుండగా.. మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. మోంక్స్ అండ్ మంకీస్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానిక ఇవి రాధన్ సంగీతం అందిస్తున్నాడు. నితిన్ – భరత్ స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహిస్తున్నారు.






# ప్రభాస్ ఫౌజీలో పాపులర్ మలయాళ భామ



గ్లోబల్ స్టార్ యాక్టర్ హను రాఘవపూడి–ప్రభాస్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసిందే. –ఫౌజీ–టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రంలో ఇమాన్వీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. పాపులర్ మలయాళ భామ నమితా ప్రమోద్ ఈ మూవీలో సెకండ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రాలేదు. నమితా ప్రమోద్ ఇప్పటికే తెలుగులో చుట్టాలబ్బాయి, కథలో రాజకుమారి సినిమాల్లో నటించింది. మరి ప్రభాస్ సినిమాపై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఫౌజీ హనురాఘవపూడి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో ప్రభాస్ ఒక సైనికుడి పాత్ర పోషిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. సీతారామం, రాధేశ్యామ్ లైన్‌లో వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫౌజీ సాగనుందట. ప్రభాస్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ 2, సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో స్పిరిట్, మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ సినిమాలు చేస్తున్నాడు.

# మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న మధ్యప్రదేశ్ భామ నిఖిత పోర్వాల్

అందాల పోటీలలో మధ్యప్రదేశ్ యువతి నిఖిత పోర్వాల్ సత్తా చాటింది. ప్రతిష్టాత్మక 60వ ఎడిషన్ ఫెమినా మిస్ ఇండియా ఫైనల్ పోటీలు ముంబాయిలో బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఇక ఈ పోటీల్లో 2024కు గాను ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన నిఖిత పోర్వాల్ దక్కించుకుంది. గతేడాది మిస్ ఇండియా టైటిల్ గెలిచిన రాజస్థాన్‌కు చెందిన నందినీ గుప్తా కిరిటాన్ని నిఖిత పోర్వల్‌కు అందించింది. మరోవైపు ఈ పోటిల్లో నిఖిత పోర్వాల్‌కి గట్టిపోటినిచ్చిన రేఖా పాండే మొదటి రన్నరప్‌గా నిలువగా.. ఆయుశీ దోలకియా రెండవ రన్నరప్‌గా నిలిచింది. ఇక మిస్ ఇండియా కిరిటం దక్కించుకున్న నిఖితా మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. బుధవారం రాత్రి అట్ట హాసంగా జరిగిన ఈ వేడుకలకు సినీ తారలతో పాటు పలు రంగానికి చెందిన ప్రముఖులు తరలి వచ్చారు. స్టేజీపై ఆట, పాటలతో హెూరెత్తించారు.



# తగ్గేదేలే..

## ‘పుష్ప ది రూల్’ నుంచి అల్లు అర్జున్ కొత్త పోస్టర్

నేషనల్ అవార్డు విన్నర్, టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్‌కు క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మరో 50 రోజుల్లో ‘పుష్ప ది రూల్’ కౌంట్‌డౌన్ షురూ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ‘పుష్ప 2’. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక ‘పుష్ప 2’ విడుదలకు ఇంకా 50 రోజులు మాత్రమే ఉన్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. అయితే ఈ సినిమాను ప్రీ పోన్ చేసి డిసెంబర్ 05న విడుదల చేయనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI Title -Code :TELTEL 12276 Cell No.9397303326,